

కుక్కునూరు మండల ఇబ్రహీంపేటలోని ఇసుక నిల్వలు

ఉచిత ఇసుక.. అదిరింది!

ఐదేళ్ల పాటు అన్ని వర్గాలు పడిన కష్టాలన్నీ ఇప్పుడు ఒక్కొక్కటిగా తగ్గుముఖం పడుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వ్యవస్థలను గాడిలో పెడు తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణం అమల్లోకి తెస్తోంది. అందులో ఉచిత ఇసుక విధానం అమలు ఒకటి.. ఈ విధానంలో అసలు ఇసుక రవాణా సాధ్యమేనా..? అనే అనుమానాలను వారం తిరగకముందే పటాపంచ్‌లు చేశారు. ఇప్పటి వరకు ఎక్కడైతే ఇసుక నిల్వలు ఉన్నాయో? అక్కడి నుంచే ఉచిత ఇసుక విధా నాన్ని అమల్లోకి తెచ్చారు. ప్రతి వినియోగ దారుడు రోజుకి 20 టన్నుల తగ్గకుండా ఇసుకను అందించేందుకు సంకల్పించి ఆ మేరకు ఇసుక కష్టాలకు క్రమేపీ తెరదించటం ఆరంభమైంది.

తొలి వారంలోనే కొత్త విధానం సక్సెస్

- స్టాక్ పాయింట్‌లలో లక్ష టన్నుల ఇసుక నిల్వలు
- ఇప్పటి వరకు 800 టన్నులకు పైబడే సరఫరా
- వినియోగదారుల్లో పెరిగిన విశ్వాసం, సంతృప్తి
- ఇప్పుడేమంటారంటూ వైసీపీని నిలదీస్తున్న కూటమి నేతలు

(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

జిల్లాలో మూడు ఇసుక నిల్వ పాయింట్లు ఉన్నాయి. తొలి మూడు రోజుల్లోనే దాదాపు 400 మెట్రిక్ టన్నులు వినియోగదారులకు అందించగా, ఇప్పటి వరకు 800 టన్నుల వరకు ఉచితంగా ఇసుకను రవాణా చేసి ఈ విధానంపై నానా యాగీ చేసినా వైసీపీని కిమ్మనకుండా చేశారు. ఇక భవిష్యత్‌లోనూ మరింత వేగంపుంజుకునే అవకాశం ఉంది. దీనిలో భాగంగానే జిల్లా యంత్రాంగం ఎక్కడికక్కడ ఇసుక పాయింట్ల వద్ద రోజువారీ పర్యవేక్షణ ఆరంభించింది. జిల్లా పరిధిలోని కుక్కునూరు మండలం ఇంజరం, ఇబ్రహీంపేట, ఉంగుటూరు మండలం చేబ్రోలులో ఇసుక నిల్వలను గుర్తించి అక్కడి నుంచే ప్రజలు వినియోగదారులకు ఉచిత ఇసుక అందించే కార్యక్రమం గడిచిన ఐదురోజుల క్రితం ఆరంభ మైంది. తొలుత ఉన్న కొద్దిపాటి నిల్వలను ఉచితంగా అందించడం సాధ్యమేనా అనే అనుమానాలు అందరిలోనూ వ్యక్తమైయ్యాయి. కాని ఇప్పటి వరకు ఉన్న సమాచారం ప్రకారం ఈ మూడు స్టాక్ పాయింట్‌లలోనూ ఇప్పటికే లక్ష మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు అందుబాటులో ఉన్నట్టు అధికారులు తేల్చారు. చేబ్రోలు ఇసుక పాయింట్‌లో 567 మెట్రిక్ టన్నులు, ఇంజరంలో 4,259 మెట్రిక్ టన్నులు ఇబ్రహీంపేటలో 95,265 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉంది. అంటే ఈ మూడు పాయింట్లలో లక్ష మెట్రిక్ టన్నులు ఇసుక నిల్వ ఉండగా, ఇప్పటివరకు వినియోగ దారులకు ఉచితంగా అందించిన ఇసుక 800 టన్నులు దాటింది. తవ్వకం, లోడింగ్, రవాణాను కలిపి చేబ్రోలులో ఒక మెట్రిక్ టన్ను ఇసుకకు రూ.531, ఇంజరంలో రూ.361, ఇబ్రహీంపేటలో రూ.210 ఇసుక ఛార్జీలుగా నిర్ణయించారు. ఈ ధరలు సాధారణ ప్రజలకు కాస్తంత అందుబాటులో ఉండడంతో ఇసుక నిల్వ కేంద్రాల వద్ద వినియోగదారులు బారులుదీరుతున్నారు. ముందుగా ఆన్‌లైన్ పద్ధతిలోనే ఉచిత ఇసుకకు దరఖాస్తు చేసుకుంటున్నారు. ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకే ఉచిత ఇసుక అందుబాటులో ఉంటుంది. ఇంకోవైపు గనుల శాఖతో పాటు పోలీస్, రెవెన్యూ విభాగాలు ఉచిత ఇసుక రవాణాపై అప్రమత్తంగా వ్యవ హరిస్తున్నాయి. ఏరోజుకు ఆ రోజు ఏఏ స్టాక్ పాయింట్ల దగ్గర నుంచి ఎంతెంత ఇసుకను ఉచితంగా అందిస్తున్నారో అనేది ప్రభుత్వానికి సమాచారం అందజేస్తున్నారు. సోషల్ మీడియాలో వైసీపీ ఇసుక విధానం ఆరంభమైన తొలి రెండు, మూడురోజుల్లోనూ నానా యాగీ చేసేందుకు ముప్పుతిప్పలు పడింది. ఈ విధానాన్ని అపహాస్యం చేసేందుకు శతవిధాలా ప్రయత్నించింది. వీటన్నింటికి దీటుగానే ఒకవైపు ప్రభుత్వం, మరోవైపు యంత్రాంగం పటిష్ఠంగా చర్యలు తీసుకోవడమే కాకుండా అమల్లోనూ లోటుపాట్లు జరగకుండా ఈ విధానం పై ఎలాంటి క్రీనీడలు అలుముకోకుండా జాగ్రత్తపడ్డాయి.

ఇప్పుడు ఏమంటారు..?

రాష్ట్రవ్యాప్తంగా గడిచిన ఐదేళ్లగా ఇసుక కోసం వినియోగదారులు పడిన కష్టాలు ఇప్పటికీ ఎవరూ మర్చిపోలేనంత చేదు జ్ఞాపకాలను మిగి ల్చాయి. ఇసుక పేరిట సాగిన దోపిడీ అందరికీ తెలిసిన సత్యమే. దీనికి తోడు వైసీపీ హయాంలో టన్ను ఇసుక కొనాలంటే పైకి చెప్పింది ఒక ధర.. లోలోన వసూలు చేసింది ధర మరొకటి. దీనికి తోడు వైసీపీ నేతలంతా ఇష్టారాజ్యంగా వాగులు, వంకల్లోనూ ఇసుకను కుమ్మేశారు. తమ్మిలేరులో అయితే ఇసుక కోసం తవ్విన గోతులు సజీవసాక్ష్యంగా కనిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుక కష్టాలు, నష్టాలు క్రమక్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. రాజకీయంగా ఉచిత ఇసుక విధానం కూటమి ప్రభుత్వానికి మంచి మార్కులే మిగిల్చింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం నిర్దేశించిన ఉచిత ఇసుక ధరలతో పోలిస్తే గతంలో ఉన్న ధరలు ఆకాశానికి, భూమికి ఉన్నంత తేడా ఉన్నాయని, వినియోగ దారులే చెబుతున్నారు. ఒకప్పుడు ఇసుక పేరిట దోపిడీ చేశారు. వైసీపీ నేతల కనుసన్నల్లో వేలటన్నుల ఇసుక అనేకచోట్ల గుట్టగుట్టలుగా పేరుకొని ఐదేళ్ల పాటు వారికొక ఇసుక వ్యాపారాన్ని సమాంతరంగా లాభాలను మిగిల్చాయి. ఇదేమని నిలదీసిన వారిపైన అక్రమ కేసులు బనాయించారు. కాని కూటమి ప్రభుత్వం ప్రజలకు ఉచిత ఇసుకవిధానం విజయవంతంగా అమల్లోకి తెచ్చింది. 'ఇప్పుడేమంటారు ఉచిత ఇసుక విధానం, ప్రజలకు అవసరం లేదంటారా? కేవలం మీ పార్టీవారికే అవసరం లేదా? తేల్చి చెప్పండి' అంటూ తెలుగుదేశం జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు సూటిగా ప్రశ్నిం చారు. ఇంకోవైపు ఇసుక నిల్వలను ఏ రోజుకు ఆరోజు బేరీజు వేస్తున్నాం. ఇప్పటివరకు రవాణా జరిగిన ఇసుక ఎంత మొత్తంలో ఇచ్చింది, రవాణా ఛార్జీల నిమిత్తం ఎంత మేర ప్రభుత్వానికి వినియోగదారులు చెల్లించిందనే వివరాలు అన్నింటిని ఏ రోజుకారోజు పారదర్శకంగా ప్రభుత్వ వెబ్‌సైట్‌లోనే నమోదు చేస్తున్నా మని సంబంధిత అధికారులు ప్రకటిస్తున్నారు. ప్రత్యేకించి ఏలూరు జిల్లాలో వచ్చే మూడు నెలల్లోపు అవసరమైన మేర ప్రజలకు అందించేందుకు వీలుగా మూడు స్టాక్ పాయింట్‌లలో లక్ష టన్నుల ఇసుక అందుబాటులో ఉందని, నియమ నిబంధనల మేరకు ఉచిత ఇసుకకు వినియోగదారులంతా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకుని పొందవచ్చని ఇప్పటికే రెవెన్యూ అధికారులు ప్రకటించారు.

జిల్లాలో భారీగా కురుస్తున్న వర్షాలు

ఏలూరు సిటీ, జూలై 12 : ఉత్తరకోస్తా తీరం మీద ఉన్న ఉపరితల ఆవర్తనం, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం కారణంగా జిల్లాలో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. పగటి సమయంలో నాను డు వర్షాలు కురుస్తున్నా అర్ధరాత్రి భారీ వర్షాలు కురుస్తు న్నాయి. శనివారం నుంచి వర్షాల జోరు పెరుగుతుందని ఇప్పటికే వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. గడచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా నూజివీడు మండలంలో 74.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 23.2 మి.మీ నమోదైంది. పెదవేగి 49.8, ద్వారకా తిరుమల 44, కామవరపుకోట 39.4, నిడమర్రు 34.6, ఉంగుటూరు 31.2, ఆగిరిపల్లి 29.4, ముదినేపల్లి 29.2, ముసునూరు 29, దెందులూరు 25.2, చింతలపూడి 25, టి.నరసాపురం 22, జీలుగుమిల్లి 21.6, కలిదిండి 20.8, కైకలూరు 20.6, ఏలూరు అర్బన్ 19.8, ఏలూరు రూరల్ 18.2, మండవల్లి 16.8, పెదపాడు 15.8, లింగపాలెం 15.6, బుట్టాయిగూడెం 15.4, కొయ్యలగూడెం 13.2, భీమడోలు 11.8, జంగారెడ్డిగూడెం 9.4, పోలవరం 8.6, చాట్రాయి 4.2, వేలేరుపాడు 4, కుక్కునూరు 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది. కాగా కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలో సార్వా వరి సాగు పనులు ఊపందుకున్నాయి. వరినారుమళ్లు 43.9 శాతం వరకు పూర్తికాగా, వరి నాట్లు 8.6 శాతం మాత్రమే పూర్తయ్యా యి. జిల్లాలో ఈ ఏడాది సార్వాలో వరి సాగు 2,33,739 ఎకరాలు లక్ష్యం కాగా దీనికి సంబంధించి జిల్లాలో 11,687 ఎకరాల్లో నారుమళ్ళు వేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 5,133 ఎకరాల్లో (43.9 శాతం) నారుమళ్లు పూర్తయ్యా యి. ఇప్పటివరకు 20,026 ఎకరాల్లో (8.6 శాతం) వరినాట్లు జరిగాయి. మొక్కజొన్న 2,585 ఎకరాలకు గాను ఇప్పటివరకు 32 ఎకరాల్లో, మినుములు 5,641 ఎకరాలకు గాను 20 ఎకరాల్లో, వేరుశనగ 2,387 ఎకరాలకు గాను 15 ఎకరాల్లో, పత్తి 10,774 ఎకరాలకు ఇప్పటివరకు 501 ఎకరాల్లో సాగు చేపట్టారు.



సాగునీటితో కళకళలాడుతున్న మర్లగూడెం పంట చెరువు

పంట చెరువులకు జలకళ

ఏజెన్సీలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో చెరువుల్లోకి వరదనీరు చేరడంతో సాగునీటితో పంట చెరువులు జలకళను సంతరించుకున్నాయి. మండలంలో 55 చెరువులు, 18 చెక్‌డ్యామ్‌ల కింద 4,500 ఎకరాల ఆయకట్టులో వరి సాగవుతుంది. చెరువుల్లోకి నీరు చేర డంతో రైతులు వ్యవసాయ పనులు ముమ్మరం చేశారు.

- బుట్టాయగూడెం

పామాయిల్‌కు రూ.17 వేలు కనీస మద్దతు ధర కల్పిస్తాం : ఎంపీ

ఏలూరుటూటౌన్, జూలై 12 : పామాయిల్ పంట టన్నుకు రూ.17 వేలు కనీస మద్దతు ధర కల్పించడానికి కృషి చేస్తానని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అన్నారు. ఎంపీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పామాయిల్ రైతులతో సమావేశం జరిగింది. ఎంపీ మాట్లాడుతూ.. 'పొగాకు, కొబ్బరి పంటలకు బోర్డులు ఏర్పాటు చేసినట్టుగానే పామాయిల్‌కు బోర్డు ఏర్పాటు చేస్తాం. పోలవరం, చింతలపూడి ఎత్తిపోతలను పూర్తి చేస్తాం. కేంద్ర మంత్రులతో మాట్లాడి రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తా '.. అని తెలిపారు. అలాగే వరి రైతులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రాజమండ్రిలో అతిపెద్ద రైస్ ఫ్యాక్టరీని నిర్మిస్తున్నామని, ప్రతీ రోజు 3500 టన్నుల ధాన్యం అవసరమవుతుందని, ఆ ఫ్యాక్టరీకి రైస్ సరఫరా చేసే రైతులకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని, తడిచిన ధాన్యాన్ని కూడా వారే కొంటారని తెలిపారు. రైతుల సమ స్యల పరిష్కారానికి ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటానని, రెండే ళ్ళగా వైసీపీ ప్రభుత్వం రైతులకు తగ్గించి ఇచ్చిన సొమ్ము ను తిరిగి ఇప్పించడానికి కృషి చేస్తానన్నారు. ఈ సమా వేశాల్లో మాజీ ఎమ్మెల్యే గంటా మురళీరామకృష్ణ, పామా యిల్ రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీరరాఘవరావు, జాతీయ కార్యదర్శి క్రాంతికుమార్‌రెడ్డి, ఆయిల్‌ఫెడ్ అధ్యక్షుడు ఉండవల్లి వెంకట్రావు, నవ భారత్ అధ్యక్షుడు అచంట సూర్యనారాయణ, చింతమనేని హను మంత రావు, సాయిబాబు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, ఎం.శ్రీనివాసరావు, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పుట్టా



వంటశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలి

- కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ఏలూరు రూరల్, జూలై 12 : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధనతో పాటు పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్నం భోజనాన్ని అందించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కస్తూరిబా బాలికోన్నత పాఠశాలను శుక్రవారం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేసి విద్యా బోధన, మధ్యాహ్నం భోజన నాణ్యతను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభు త్వ పాఠశాలల్లో విద్యాబోధన ఉండాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మి కంగా తనిఖీ చేస్తానని, ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘి స్తే సిబ్బందిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విద్యా ర్థులకు వండిన ఆహారాన్ని తిని నాణ్యతను పరిశీలించారు. డీఈవో అబ్రహం, కమిష నర్ వెంకటకృష్ణ, తహసీల్దార్ మురార్జీ, ఎంఈవో రంగయ్య, ఆ పాఠశాల హెచ్‌ఎం సునీత పాల్గొన్నారు.

- ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యనభ్యసించిన విద్యా ర్థులకు జాతీయ స్థాయి సంస్థల్లో సీటు సాధించే స్థాయిలో విద్య అందించేలా అధ్యాపకులు మెరుగైన బోధన చేయా లని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సి పాళ్లలతో విద్యాబోధన, విద్యాఫలితాలు, కాంట్రాక్ట్ లెక్చరర్ల సేవలు కొనసాగింపుపై సమీక్షించారు.

ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో.. అందుబాటులోకి సిటీస్కాన్



ఏలూరు క్రైం, జూలై 12 : ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న సిటీస్కాన్ పనిచేయడం లేదని 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 11వ తేదీన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈనెల 6వ తేదీ నుంచి సిటీస్కాన్ సాఫ్ట్‌వేర్ సమస్య తలెత్తి పని చేయలేదు. సంబంధిత కంపెనీ ఇంజనీర్లు వచ్చి చూశారు. అయినప్పటికీ కాలయాపన చేస్తుండడంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో అధికారులు సత్వర చర్యలు చేపట్టి సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయించి సంబంధిత ఇంజనీర్ల ద్వారా మరమ్మతులు చేయించారు. శుక్రవారం ఉదయం నుంచి సిటీ స్కాన్‌ను యథావిధిగా రోగులకు అందుబాటులోకి తీసుకొచ్చి 80 స్కాన్‌లు తీశారు.

• రోడ్లపై గోతులు.. జనం పాట్లు

పేరుకే జిల్లా కేంద్రం.. ఏలూరు నగరంలో ఏ రోడ్డు చూసిన గోతులతో అధ్వానమే.. గత వైసీపీ ప్రభుత్వం రోడ్లను పట్టించుకోకపోవడంతో దారుణంగా మారాయని నగర వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడితే ఎక్కడ గొయ్యి ఉందో తెలియని పరిస్థితి. శాంతినగర్, నిత్యం రద్దీగా ఉండే ఆర్‌ఆర్‌పేట రోడ్లు గోతులు పడడంతో వాహన దారులు ఇక్కట్లు పడుతున్నారు. అలాగే చొదిమెళ్ల సమీపంలో చింతలపూడి వెళ్లు రోడ్డు అడుగుకో గొయ్యి చొప్పున అధ్వానంగా మారింది. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఈ రోడ్లపై దృష్టి సారించి మరమ్మతులు చేపట్టాలని వాహన దారులు, నగరవాసులు కోరుతున్నారు.

- ఆంధ్రజ్యోతి- ఫొటోగ్రాఫర్, ఏలూరు



సత్రంపాడు పోలీస్ పెట్రోలు బంకు పక్కన శాంతినగర్‌కు వెళ్లే రోడ్డు గోతులతో ఇలా..



నిత్యం రద్దీగా ఉండే ఆర్‌ఆర్‌పేటలో రోడ్డు దుస్థితి





చొదిమెళ్ల సమీపంలో చింతలపూడికి వెళ్లు రోడ్డు దుస్థితి

డీజీపీ డిస్క్ అవార్డుల ప్రదానం

ఏలూరు క్రైం, జూలై 12 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ ప్రతిష్ఠాత్మకమైన కమాండేషన్ డిస్క్ అవార్డులు -2022 పురస్కరించుకుని జిల్లాలోని పలువురి సిబ్బందికి ఆ అవార్డులను ఎస్పీ మేరీ ప్రశాంతి ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో అందించి అభినందించారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం జరిగిన ఒక కార్యక్రమంలో డీజీపీ డిస్క్ అవార్డులను, ప్రశంసా పత్రా లను సిబ్బందికి ఎస్పీ అందించారు. ఏలూరు డీసీఆర్బీలో పనిచేస్తున్న ఏఎస్‌ఐ రమేష్ బాబు, ఏలూరు డీఎస్పీ కార్యా లయంలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, ఏలూరు సీసీఎస్‌లో పనిచేస్తున్న లక్ష్మణ్, మహిళా పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న మహిళా హెడ్ కానిస్టేబుల్ వెంకట రమణ, కానిస్టేబుళ్లు ఎల్.లక్ష్మీనారాయణ, ఎం.బాలకృష్ణ, బుట్టాయగూడెం పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ ఎన్.బాలకృష్ణకు ప్రతిష్ఠాత్మక అవార్డులను అందించి అభినం దించారు. కార్యక్రమంలో ఏఆర్‌ఆర్‌ఐ పవన్‌కుమార్, తది తరులు పాల్గొన్నారు.



అవార్డులు అందుకున్న సిబ్బందితో ఎస్పీ మేరీ ప్రశాంతి

రెడ్‌క్రాస్‌కు అవినీతి మరకలు

- రెడ్‌క్రాస్ మాజీ ఛైర్మన్ జేపీ, మాజీ మంత్రి నానిపై విచారణ జరపాలంటూ ధర్నా

ఏలూరు రూరల్, జూలై 12 : రెడ్‌క్రాస్‌ను భ్రష్టు పట్టించి కోట్ల రూపాయలు దిగమింగిన రెడ్‌క్రాస్ మాజీ ఛైర్మన్ మామిళ్ళపల్లి జయప్రకాష్ అతనికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే ఆళ్ళనానిపై కఠిన చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ యువజన సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించి కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రెడ్‌క్రాస్ సంస్థలో కొవిడ్ సమయంలో జరిగిన నిధుల గోల్‌మాల్ వ్యవహారాన్ని బహిర్గతం చేయాలని, బహిరంగ విచారణ నిర్వహించి దోషులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం కార్యదర్శి బాలాజీ మాట్లాడుతూ నిస్వార్థమైన సేవలు అందించే రెడ్‌క్రాస్ సంస్థకు అవినీతి మరకలు అంటించిన జయప్రకాష్‌పై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. కోట్ల రూపాయలు అవినీతి జరిగినా అప్పటి ఉప ముఖ్యమంత్రి ఆళ్ళ నాని అండదండలతో పూర్తిస్థాయిలో వెలుగులోకి రాకుండా నిజాన్ని దాచేశారని ఆరోపించారు. ఈ విషయంలో లోకాయుక్తను ఆశ్రయిస్తామని, హోంమంత్రి వంగలపూడి అనితను కలిసి వినతిపత్రాన్ని అందజేస్తామన్నారు. ధర్నా లో సంగం అధ్యక్షుడు జాలా శివశంకర్, బోడా కిరణ్, పెద్దాడ వెంకటరమణ, రమేష్, ఎస్.వెంకట రమణ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న అంబేడ్కర్ యువజన సంఘం ప్రతినిధులు

ఉపాధికి ఊతం!

- కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కోటి ఆశల్లో కూలీలు, ఉద్యాన వన రైతులు
- ఆ దిశగానే చర్యలకు దిగిన ప్రభుత్వం
- ఉద్యాన పంటలకు 'ఉపాధి' అనుసంధానం
- పెట్టుబడుల భారం తగ్గుతుందని రైతుల హర్షం



ఏలూరు రూరల్, జూలై 12 : వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో వ్యవస్థలు అన్ని నిర్వీర్యం అయ్యాయి. కక్ష కట్టిన ట్టు కొన్ని పథకాల అమలులో నిర్లక్ష్యం చూపింది. ఇలాంటి వాటిల్లో ఉపాధి హామీ పథకం ఒకటి. వల సల నివా రణ కోసం తీసుకొచ్చిన ఈ పథకంలో రక్షణ, భూగర్భ జలాలు పరిరక్షణ తది తర కీలక అంశాలు ఉన్నాయి. గతాన్ని పరిశీలిస్తే రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఈ పథకం ద్వారా కూలీలకు లబ్ధి చేకూర్చేవారు. దీనికి భిన్నం గా గత వైసీపీ ప్రభుత్వం కూలీలకు కల్పించాల్సిన సదు పాయాల్లో కోత విధించింది. ఏలూరు జిల్లాలో మూడు లక్షలు జాబ్‌కార్డులు ఉండగా, 1.8 లక్షల పైబడి కూలీలు పనుల్లో పాల్గొంటారు. ఎండలో పనిచేసే ఈ కూలీలకు కొద్దిసేపు విశ్రాంతి తీసుకునేందుకు టెంట్‌లు, కూలీలకు ఏమైనా జరిగితే తక్షణమే ప్రాథమిక వైద్యం అందించేందుకు మెడికల్ కిట్‌లు అందుబాటులో లేకుండా చేసింది. జిల్లాల్లో దాదాపు 30 మండలాల్లో పంచాయతీల్లో పరిస్థితి ఇలాగే కొనసాగింది.

కూటమి ప్రభుత్వం రాకతో..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం కీలకమైన గ్రామీణాభివృద్ధి శాఖ ను జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కేటాయించడంతో తమకు మేలు జరుగుతుందని ఉపాధి కూలీలు, ఉద్యానవన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఉపాధి కూలీలకు వేతన సవరణ మరింత మెరుగ్గా ఉంటుందని వారంతా ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రైతుల భూముల్లో ఉద్యానపంటల సాగు, నీరు నిల్వ ఉండేలా పనులపై దృష్టి సారించాలని ఇప్పటికే మంత్రి అధికారుల సమీక్షలో చర్చించడంతో వాటి అమలు కోసం రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఉద్యాన పంట లకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేస్తూ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత పవన్ కల్యాణ్ తొలిసంతకం చేశారు. పెట్టుబడులు, ఖర్చులు భారంగా మారుతున్న నేపథ్యంలో ఉపాధి హామీతో ఉద్యానవన పంటల సేద్యాన్ని సమ్మిళితం చేయడం వల్ల ఉపశమనం కలుగుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయండి..

ఉపాధి హామీ పనులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు అందాయి. 15వ ఆర్థిక సంఘం సాధారణ నిధులతో చేపట్టిన పనులు, ఖర్చులు వాటి వివరాలను నెలాఖరులోగా సమర్పించాలని, జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో వ్యవసాయ, పశుసంవర్ధక, ఉద్యానవన, ఐసీడీఎస్, పంచాయతీరాజ్ తదితర శాఖల్లో ప్రతి పాదనలు సిద్ధం చేయాలని ఆదేశాలు అందాయి. ఉపాధి హామీ పథకం పనిదినాల సంఖ్య అనుగుణంగా పనుల్లో పురోగతి సాధిస్తుందని, మరింత మెరుగ్గా ఉపాధి హామీ ఉంటుందని రైతులు ఆశతో ఉన్నారు.



పరశురామునిగా జగన్నాథుడు

ద్వారకాతిరుమల, జూలై 12: పరశురాముని అలంకరణలో జగన్నాథుడు శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఒక చేతిలో గొడ్డలి, మరో చేతిలో కమండలాన్ని ధరించి ఉన్న పరశురామ అలంకరణ భక్తులకు కనువిందు చేసింది. శ్రీవారి దత్తత దేవాలయమైన లక్ష్మీపురం ఆలయంలో జరుగుతున్న జగన్నాథ రథోత్సవాలను పురస్కరించుకుని రోజుకో అలంకారం చేస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించి తీర్థ, ప్రసాదాలను స్వీకరించారు.



వడలిలో పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మహేశ్వరరావు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పెనుగొండ, జూలై 12: సీజనల్ వ్యాధుల పట్ల ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మహేశ్వరరావు అన్నారు. సిద్ధాంతం ప్రాథమిక ఆరోగ్యకేంద్ర పరిధిలో శుక్రవారం వడలి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో జ్వరాల కేసుల వివరాలను తెలుసుకున్నారు. ఆరోగ్య సిబ్బంది ప్రతీ రోజూ ఇంటింటికి వెళ్లి సర్వే చేయాలన్నారు. ప్రజలకు వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్నారు. తామరాడ గ్రామంలో శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. తణుకు సబ్ యూనిట్ అధికారి జి.వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురుగునీరు నిల్వ లేకుడా చర్యలు తీసుకోవాలన్నారు. జ్వరం వస్తే తక్షణం వైద్యులను సంప్రదించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్యామల, బృంగేశ్వరరావు, పి.లక్ష్మి దుర్గ, సిబ్బంది పాల్గొన్నారు.



రామన్నపాలెం వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలిస్తున్న బృంద సభ్యులతో వైద్య సిబ్బంది (ఫైల్ ఫొటో)

రామన్నపాలెం వెల్‌నెస్ సెంటర్‌కు కేంద్ర ప్రభుత్వ నాణ్యతా ప్రమాణ పత్రం

మొగల్తూరు, జూలై 12: మొగల్తూరు మండలం రామన్నపాలెం 1వ సచివాలయ పరిధిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కేంద్ర ప్రభుత్వం జాతీయ నాణ్యతా హామీ ప్రమాణ పత్రం సాధించిందని మొగల్తూరు ఆసుపత్రి వైద్యులు దినేష్, లక్ష్మీపార్వతిలు శుక్రవారం తెలిపారు. రామన్నపాలెం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను గత నెలలో ఢిల్లీలోని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖకు చెందిన (ఎస్‌కాస్) జాతీయ నాణ్యతా ప్రమాణాల సంస్థ సభ్యులు సందర్శించారన్నారు. వెల్‌నెస్ సెంటర్‌లో సదుపాయాలు, రోగికి అందిస్తున్న సేవలు, ఆరోగ్య పరిరక్షణ, వ్యాధి నియంత్రణ, నాణ్యత, నిర్వహణ తదితర 8 అంశాలను పరిశీలించి విశ్లేషణ చేసి నూటికి 84 శాతం మార్కులు ఇచ్చారన్నారు. మార్కులకు అనుగుణంగా సంస్థ ఉన్నతాధికారులు జాతీయ నాణ్యతా హామీ ప్రమాణపత్రాన్ని గురువారం అందించారని వైద్యులు తెలిపారు. సర్పంచ్ బందెల ఎలీషా, ఉప సర్పంచ్ మేకల పరుశరామ్, గ్రామపెద్దలు లక్ష్మణరావు, కుక్కల మోహనరావు తదితరులు వైద్య సిబ్బందిని అభినందించారు.

పీఎఫ్, ఈఎస్ఐ కట్టకపోతే 20 నుంచి సమ్మె

ఏలూరు క్రైం, జూలై 12 : ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న ఏపీ మెడికల్ కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి సంబంధిత థర్డ్ పార్టీ కాంట్రాక్టర్ పీఎఫ్, ఈఎస్ఐ సొమ్ములను కట్టకపోతే ఈనెల 20వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు ప్రకటించారు. జిల్లాలోని ఏలూరు ప్రభుత్వాసుపత్రి, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, బుట్టాయిగూడెం, పోలవరం, దెందులూరు, భీమడోలు ఆసుపత్రులలో పనిచేస్తున్న శానిటరీ వర్కర్లకు కాంట్రాక్టర్ దాదాపు 17 నెలలు పీఎఫ్, ఈఎస్ఐ కట్టకుండా నిర్లక్ష్యం వహించారన్నారు. తాము సంబంధిత అధికారులకు ఈ ఏడాది మార్చి 29న ఫిర్యాదు చేయగా నెలరోజుల్లో చెల్లిస్తామంటూ ఈ ఏడాది ఏప్రిల్ 10వ తేదీన సంబంధిత కాంట్రాక్టర్ హామీ లెటరు ఇచ్చారని అయినప్పటికీ ఇంత వరకూ చెల్లించలేదన్నారు. వచ్చేనెల ఆగస్టుతో కాంట్రాక్టు ముగిసిపోతుందని ఒక్కో కార్మికునికి రూ.50 వేల వరకూ కాంట్రాక్టర్ చెల్లించాలని అవి చెల్లించకుండా నిబంధనలకు విరుద్ధంగా అధికారులు బిల్లులు చెల్లిస్తున్నారని ఆరోపించారు. ఈనెల 20లోపు పీఎఫ్, ఈఎస్ఐ సొమ్ములను చెల్లించకపోతే శానిటరీ కార్మికులు సమ్మె చేయనున్నట్లు ప్రకటించారు.

కౌలు గుర్తింపు కార్డు తీసుకోవాలి

కైకలూరు జూలై 12 : ప్రతీ కౌలుదారుడు గుర్తింపు కార్డులు తీసుకోవాలని, అప్పుడే ప్రకృతి వైపరీత్యాల వల్ల వచ్చే నష్టపరిహారాలు నేరుగా కౌలుదారునికే అందుతాయని వ్యవసాయశాఖ ఏడీ ఆర్.గంగాధరరావు అన్నారు. శుక్రవారం వేమవరప్పాడులో కౌలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతీ కౌలుదారుడు భూయజమాని అంగీకారంతో కౌలు గుర్తింపుకార్డు తీసుకోవాలని దీని వల్ల కౌలు రైతుకు వ్యవసాయ శాఖ ద్వారా అమలయ్యే పలు పథకాలు అందుతాయన్నారు. కార్డు తీసుకోవడం వల్ల భూయజమానికి ఎలాంటి నష్టం వాటిల్లదన్నారు.ఈ కార్డు పదకొండు నెలల కాలపరిమితికి మాత్రమే ఉపయోగపడుతుందన్నారు. కౌలు రైతు ఆధారుకార్డు జిరాక్సు, పాస్‌పోర్ట్ ఫొటో, భూయజమాని పొలం పాస్‌బుక్ జిరాక్సు కాపీలను వీఆర్వో, వీఏఏలకు అందజేయాలన్నారు.

హార్బర్ కథ ఏమైంది !



బియ్యపుతిప్ప వద్ద హార్బర్ కోసం సేకరించిన స్థలం

రెండేళ్ల క్రితం జగన్‌మోహన్ రెడ్డి బియ్యపు తిప్పవద్ద శంకుస్థాపన

రూ.394 కోట్లు అంచనా.. కేంద్ర అనుమతి కోసం ప్రతిపాదన

అనుకూలత లేదన్న నిపుణుల బృందం

ల్యాండ్ ఫిల్లింగ్ సెంటర్ కోసం టీడీపీ హయాంలో నిర్ణయం

రూ. 18 కోట్లు కేటాయింపు.. రూ. 2 కోట్లతో పనులు

వైసీపీ వచ్చాక హార్బర్ అంటూ హడావుడి

రాష్ట్ర నిధులతోనే నిర్మాణం చేపడతామంటూ ప్రగల్భాలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

నర్సాపురం తీరప్రాంతంలో బియ్యపు తిప్పవద్ద హార్బర్ నిర్మాణం కోసం రెండేళ్ల క్రితం ముఖ్యమంత్రి హోదాలో జగన్‌మోహన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఏజెన్సీని ఖరారు చేసినట్టు ప్రకటించారు. హార్బర్ అందుబాటులోకి వస్తుందంటూ నమ్మించారు. వైసీపీ ప్రభుత్వంలో ఒక్కపైసా మంజూరు చేయలేదు. మాజీ ఎమ్మెల్యే మాధవనాయుడు బియ్యపు తిప్పవద్ద ధర్నా చేస్తే పనులు చేస్తున్నట్టు వైసీపీ ప్రభుత్వం హడావుడి చేసింది. కేంద్ర అనుమతి కోసం ప్రాజెక్ట్ నివేదికను పంపినా అనుమతి రాలేదు. కేంద్రం అంగీకరిస్తేనే నిధులు మంజూరు కానున్నాయి. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో హార్బర్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ అనుమతి ఉంది.రాష్ట్ర విభజనలో భాగంగా హార్బర్‌లు నిర్మించే బాధ్యత కేంద్రంపై ఉంది. అయితే రాష్ట్ర ప్రభుత్వమే దీనిని నిర్మిస్తుందంటూ గతంలో వైసీపీ ప్రభుత్వం ముందుకొచ్చింది. జగన్‌మోహన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. తీరా మళ్లీ కేంద్ర ప్రభుత్వం అనుమతి కోసం పంపారు.

నో చెప్పిన నిపుణుల బృందం

తెలుగుదేశం కూటమి 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు హార్బర్‌లపై ప్రతిపాదన పంపింది. అప్పటి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని హార్బర్ ప్రతిపాదిత ప్రాంతాలను సందర్శించింది. బియ్యపుతిప్ప హార్బర్ తప్ప మిగిలిన వాటికి ఓకే చెప్పింది. బియ్యపు తిప్పవద్ద మాత్రం అనుకూలంగా లేదని తేల్చేసింది. గోదావరి నది సముద్రంలో కలిసే ప్రాంతానికి దగ్గరగా బియ్యపు తిప్ప ఉండడంతో ఆటుపోట్లు అధికం. ఫలితంగా ఇసుక మేటలు వేస్తుంటాయి. మరోవైపు తీరప్రాంతం కోతకు గురవుతుంటుంది. హార్బర్‌కు కూడా అదే ముప్పు పొంచి ఉందంటూ కేంద్ర నిపుణుల బృందం స్పష్టం చేసింది. దాంతో అప్పటి తెలుగుదేశం ప్రత్యామ్నాయంగా ల్యాండ్ ఫిల్లింగ్ కేంద్రాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేసింది. దాదాపు రూ.18 కోట్లు కేటాయించింది. అప్పట్లోనే రూ.2 కోట్లు వెచ్చించి పనులు ప్రారంభించారు. బోట్లు ఉంచేందుకు ఆ సెంటర్‌ను అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం నర్సాపురం లాకుల వద్ద బోట్లు నిలుపుతున్నారు. దీనివల్ల మత్స్యకారులు వేటకు వెళ్లడానికి వ్యయప్రయాసలు పడుతున్నారు.ఈ సమస్యలను అధిగమించేందుకు టీడీపీ ప్రభుత్వం హార్బర్‌కు బదులుగా బియ్యపు తిప్ప వద్ద ల్యాండ్ ఫిల్లింగ్‌కు సిద్ధమయ్యారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ హార్బర్‌ను తెరపైకి తెచ్చింది. నిపుణుల బృందం గతంలో సమ్మతించ లేదు. ఇప్పుడేం చేస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.



శిథిలమైన కేశవరం బ్రెయిలీ బ్రిడ్జి..

క్షణం..క్షణం భయం..భయం

- శిథిలావస్థలో కేశవరం బ్రెయిలీ బ్రిడ్జి
- ఏ క్షణంలోనైనా కుప్పకూలేందుకు సిద్ధం
- టీడీపీ హయాంలో నిర్మాణానికి నిధులు
- పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలి

గణపవరం, జూలై 12: గణపవరం మండలం కేశవరం ఉండి పంట కాల్వపై ఉన్న బ్రెయిలీ బ్రిడ్జి కుప్పకూలేందుకు సిద్ధంగా ఉంది. గణపవరం మండల కార్యాలయాలకు ఈ వంతెనపైనే రాకపోకలు సాగిస్తుంటారు. ఉండిపంట కాల్వపై బ్రిటిష్ ప్రభుత్వం నిర్మించిన వంతెన కూలిపోయి 14 సంవత్సరాలైంది. 2009లో అప్పటి మంత్రి వట్టి వసంతకుమార్ బ్రెయిలీ బ్రిడ్జి ఏర్పాటు చేశారు. టీడీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తదుపరి వైసీపీ ప్రభుత్వం రావడంతో వంతెన నిర్మాణ పనులు అటకెక్కించేశారు. అప్పటి నుంచి నేటి వరకు నిర్మాణం జరగలేదు. ఈ బ్రిడ్జిపై పెద్దపెద్ద రంధ్రాలు ఏర్పడటంతో రాకపోకలు సాగించాలంటే ప్రైప్రాణాలు పైనే పోతున్నాయని అంటున్నారు. వంతెన రంధ్రాల్లోకి కాళ్లు చొచ్చుకుపోయి రేకులు గీసుకుపోయిన సంఘటనలు జరిగాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా జల్లికాకినాడ, అప్పన్నపేట, మల్లపురాజుపేట గ్రామాల నుంచి ఈ వంతెన పైనే విద్యార్థులు కేశవరం హైస్కూల్‌కు రాకపోకలు సాగిస్తున్నారు. వంతెన పరిస్థితి చూసి హడలిపోతున్నారు. కేశవరం స్కూల్‌కి వెళ్లాలంటే పది కిలోమీటర్లు చుట్టి రావాల్సి వస్తుందన్నారు. అలాగే పెద్దపెద్ద రంధ్రాలు ఏర్పడటంతో పాఠశాలల బస్సులు కానీ, ఆక్వా వాహనాల రాకపోకలు కూడా జరిగే పరిస్థితులు కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు. ఇంత దీనస్థితిలో ఉన్న బ్రిడ్జికు కనీస మరమ్మతులు చేపట్టకపోవడం పట్ల ప్రజలు మండిపడుతున్నారు. నూతన వంతెన నిర్మించాలని ప్రతిపాదనలు ఉన్నా అవి కాగితాలకే పరిమితం అయ్యాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. టీడీపీ, వామపక్షాలు అనేక సార్లు వంతెన నిర్మాణానికి, కనీస మరమ్మతులకు అనేకసార్లు పోరాటాలు చేసినప్పటికి పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారని ఆరోపణలు మూట గట్టుకున్నారు. ఇప్పటికైనా బ్రిడ్జికి కనీస మరమ్మతులు చేసి రాకపోకలకు అవరోధం లేకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

● గాలికి వదిలేసిన వైసీపీ ప్రభుత్వం



కేశవరం బ్రిడ్జి పూర్తిగా శిథిలమైంది. పెద్దపెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయి. టీడీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా వైసీపీ ప్రభుత్వం వంతెన నిర్మాణ పనులు గాలికి వదిలేసింది. విద్యార్థులు ఈ వంతెనపై రాక పోకలకు భయపడుతున్నారు. దాతల సహకారంతో రంధ్రాలు పూడ్చినా వంతెన మరింత శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం మరమ్మతులైనా చేపట్టి వంతెన నిర్మాణానికి కృషి చేయాలి.

-ఇందుకూరి రామకృష్ణంరాజు, గణపవరం టీడీపీ అధ్యక్షుడు

● నూతన వంతెన నిర్మాణం చేపట్టాలి



కేశవరం వంతెన నిర్మిస్తామని గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గణపవరంలో సభలో ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేదు. కనీస మరమ్మతులు కూడా చేయలేదు. ఐదేళ్లు దాటినా ఎటువంటి ప్రతిపాదనలు లేవు. వంతెనపై గోతులు ఏర్పడటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. చుట్టుతిరిగి రావాలంటే పది కిలో మీటర్లు అదనంగా రావల్సి ఉంటుంది. నూతన వంతెన నిర్మాణం చేపట్టాలి.

-యాళ్ళ కల్యాణి, మాజీ సర్పంచ్, అప్పన్నపేట



స్పిల్‌వే వద్ద గోదావరి ఉధృతి

పెరిగిన గోదావరి

పోలవరం, జూలై 12 : పోలవరంలో గోదావరి నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి పెరిగింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉపనదుల నుంచి వస్తున్న వరద జలాలతో గోదావరిలో నీటిమట్టం రెండు రోజులుగా క్రమక్రమంగా పెరుగుతోంది. స్పిల్‌వేలోకి వస్తున్న గోదావరి జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 26.970 మీటర్లు, స్పిల్‌వే దిగువన 17.060 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యాంకి ఎగువన 27.050 మీటర్లు, దిగువ కాఫర్ డ్యాంకి దిగువన 16.080 మీటర్లు నమోదైనట్లు ఈఈలు వెంకటరమణ, మల్లిఖార్జునరావు తెలిపారు.

పట్టిసీమ నుంచి 7,080 క్యూసెక్కుల నీరు విడుదల

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి శుక్రవారం 7,080 క్యూసెక్కుల వరద జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్లు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజు తెలిపారు. పట్టిసీమలో గోదావరి నీటిమట్టం 15.387 మీటర్లకు చేరుకుందని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 20 పంపులు 20 మోటార్లతో నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.

ఎస్‌కేఎస్‌డీలో జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభించి మాట్లాడుతున్న కళాశాల సెక్రటరీ ఉషారాణి

తణుకు, జూలై 12 : జాతీయస్థాయిలో విజేతలైన క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకుని జాతీయ, అంత ర్జాతీయ పోటీల్లో విజేతలుగా నిలిచి జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలని ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి అన్నారు. శుక్రవారం కళాశాల ఇండోర్ స్టేడియంలో జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలను ప్రారంభించారు. జిల్లా సెక్రటరీ మెంటే వంశీకృష్ణ మాట్లాడుతూ ఇక్కడ విజేతలైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవుతారన్నారు. తణుకు పరిసర ప్రాంత క్రీడాకారులకు అన్ని విధాలా సహకారం అందిస్తామని కళాశాల జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు అన్నారు. టోర్నమెంటుకు 200 మంది క్రీడాకారులు హాజరయ్యారని టోర్నమెంటు ఆర్గనైజింగ్ సెక్రటరీ సతీష్ బాబు తెలిపారు. ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు కెఎస్ఆర్‌వీ ప్రసాదు, కంటిపూడి రాంబాబు, వివేకానంద గ్లోబల్ స్కూలు కరస్పాండెంట్ చిట్టూరి రీనాసాయి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైలు నుంచి జారిపడి అసోం వాసి మృతి



ఏలూరు క్రైం, జూలై 12 : రైలులో ప్రయాణిస్తున్న అసోంకు చెందిన వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని తేలప్రోలు రైల్వేస్టేషన్ దాటిన తరువాత రైలు పట్టాల వద్ద ఒక వ్యక్తి మృతదేహం ఉన్నట్లు ఏలూరు రైల్వే ఎస్ఐ నరసింహారావుకు సమాచారం అందింది. సిబ్బందితో శుక్రవారం మధ్యాహ్నం సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు అసోం రాష్ట్రానికి చెందిన రబ్బా (40)గా గుర్తించారు. అనుమానాస్పద మృతిగా నమోదు చేసి పోస్టు మార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

జేసీబీ క్రేన్ ఢీకొని వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, జూలై 12 : రోడ్డుపై నడిచివెళ్తున్న ఒక వృద్ధుడిని జేసీబీ క్రేన్ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఏలూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరు భగ్గయ్యపేటకు చెందిన ఆది సూరిబాబు (60) ప్లాట్ రిక్షా నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం చాటపర్రు రోడ్డులో టిప్‌టాప్ సామాన్లు రిక్షాపై దించి తిరిగి రోడ్డుపై నడిచి వస్తుండగా జేసీబీ క్రేన్ అతనిని ఢీకొట్టింది. దీంతో గాయాలైన అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి ఆ తరువాత ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

నరసాపురం రూరల్, జూలై 12; మండలంలోని కొప్పర్రు గ్రామంలో శుక్రవారం లారీ ఢీకొని మోటర్ సైకిలిస్టు సూర్యనారాయణమూర్తి (50) మృతి చెందినట్లు రూరల్ ఎస్సై గురువయ్య చెప్పారు. గ్రామం నుంచి మృతుడు పట్టణానికి వస్తుండగా ఈ సంఘటన జరిగిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పెట్రోల్ పోసుకుని యువకుని ఆత్మహత్యాయత్నం

ఏలూరు క్రైం, జూలై 12 : ఒక యువకుడు తనపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఏలూరు సమీపం లోని కొత్తూరు రోడ్డు ఇందిరమ్మ కాలనీ 9వ రోడ్డునకు చెందిన నువ్వుల రాజ్ విహార్ (30)కి వివాహం కాగా భార్య ఇతనితో గొడవ పడి విడిపోయింది. అప్పటి నుంచి తన తల్లితో కలిసి జీవిస్తున్నారు. శుక్రవారం ఉదయం ఏలూరులోని వంగాయిగూడెంలో ఉన్న అతని బంధువు ఇంటికి వచ్చి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. తీవ్ర గాయాలకు గురైన అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశారు. ఈ సంఘటనపై ఏలూరు ప్రభుత్వాసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

బంగారం చోరీపై కేసు నమోదు

టి.నరసాపురం, జూలై 12: బంగారం చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. తెడ్లం గ్రామానికి చెందిన చాత్రాతి గణేష్ ఈనెల 7వ తేదీన హైదరాబాద్ వెళ్ళి 11వ తేదీన ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని ఆరు కాసుల బంగారపు వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు గుర్తించాడు. బాధితుడు గణేష్ ఫిర్యాదుతో శుక్రవారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

టి.నరసాపురం, జూలై 12: ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు చేసినట్లుగా ఎస్సై డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. బొర్రంపాలెం గ్రామానికి చెందిన కొత్త ప్రద్యుమ్న సెల్‌ఫోన్‌కి తన ఆధార్ నెంబర్‌తో ముంబయ్ నుంచి తైవాన్‌కు కొరియర్ బుక్ చేశావంటూ తెలియని సెల్ నెంబర్ నుంచి ఒక వ్యక్తి ఫోను చేశాడు. ఆ కొరియర్‌తో తనకు సంబంధం లేదని ప్రద్యుమ్న తెలిపినప్పటికి తాము పోలీసులమని హర్యాణా, గుర్గావ్, పాట్నాలలో కూడా నీకు అకౌంట్లు ఉన్నాయని, వాటిని పరిశీలిస్తున్నామని నీ అకౌంట్లో 93 శాతం నగదు బదిలీ చేస్తే 15 నిమిషాల్లో మళ్లీ వెనక్కి పంపుతామని అటు వైపు వ్యక్తి తెలిపాడు. ప్రద్యుమ్న తన అకౌంట్ నుంచి 5.80 లక్షలను బదిలీ చేయగా ఆటువైపు వ్యక్తి సెల్‌ఫోన్ నుంచి బదులు రాకపోవడంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించాడు. ప్రద్యుమ్న ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలిక అత్యాచారం కేసులో అరెస్టు

అత్తిలి, జూలై 12 : అత్తిలి మండలం ఉనికిలి గ్రామంలో ఒక మైనర్ బాలికను అత్యాచారం చేశాడనే ఆరోపణపై పోక్సో చట్టం కింద నిందితుడు చిలకలపాటి ప్రవీణ్‌ను తణుకు రూరల్ సీఐ నాగేశ్వరరావు అరెస్టు చేశారు. నిందితుడు వీరవాసరం మండలం రాయకుదురు గ్రామంలో తన ఇంట్లో ఉండగా వెళ్లి అరెస్టు చేసినట్లు అత్తిలి ఎస్ఐ రాంబాబు తెలిపారు.

కోళ్లవ్యర్థాల వాహనం పట్టివేత

పెదపాడు, జూలై 12 :చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు కోళ్ల వ్యర్థాలను తరలిస్తుండగా తనిఖీలు నిర్వహించి పెదపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ సమీపంలో బోలేరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పెదపాడు ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. వాహన, చెరువు యజమానులతో పాటుగా వాహన డ్రైవర్‌పై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరుకువాడలో పేకాటపై దాడి

ఉండి జూలై 12: ఉండి మండలం చెరుకువాడ వడ్డిగుడెం ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం అందండంతో పోలీసులు దాడి చేశారు. నలుగురు వ్యక్తులను అదుపులోని తీసుకుని రూ.1800 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.



యువతుల నుంచి వివరాలు నమోదు చేస్తున్న డీసీపీవో సూర్యచక్రవేణి

రాజస్థాన్ యువతుల చందా దందా

ఏలూరులో వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ వసూళ్లు

అదుపులోకి తీసుకున్న డీసీపీవో బృందం

ఏలూరు క్రైం, జూలై 12 : రాజస్థాన్‌కు చెందిన కొంతమంది యువతులను ఒక ముఠా తీసుకు వచ్చి వివిధ ప్రాంతాలకు తిరుగుతూ భిక్షాటన చేయిస్తున్నారు. ఆ ముఠా మాత్రం మ్యాజిక్ బుక్స్ ఇతర బుక్స్ విక్రయించడానికి అంటూ రాజస్థాన్ నుంచి బయలుదేరి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ పట్టణాలు, నగరాలకు వస్తున్నారు. ఒక లాడ్జిలో ఉంటూ వివిధ ప్రాంతాలు తిరుగుతూ చందాలు వసూలు చేస్తున్నారు. వారి చేతిలో ఉన్న పుస్తకాలు, పేపర్లలోని చందాల వివరాలు చూస్తే గుండె ఆగి పోవాల్సిందే. ఏకంగా ఐదు వందల నుంచే ప్రారంభం అవుతుంది. అంతకు తక్కువ ఎవరూ ఇచ్చినట్లు కనిపించరు. యువతులు జీన్ ప్యాంట్లు, షర్టులు ధరించి ఏలూరు నగరంలో వివిధ కూడళ్ళల్లో, సిగ్నల్ పాయింట్ల వద్ద ఉంటూ యువకుల వద్దకు వెళ్లి చందాలు రాయాలంటూ కోరు తున్నారు. కాదంటే ఈసడించుకుని వెళ్తున్నారు. శుక్రవారం ఇద్దరు యువతులు ఏకంగా కలెక్టరేట్‌లోకి వెళ్లి మహిళా శిశుసంక్షేమ శాఖ కార్యాలయంలో ఉన్న ఉద్యోగులను చందాలు ఇవ్వాలనడం విశేషం. మొత్తం మీద మైనర్ యువతులతో భిక్షాటన చేయిస్తున్నారని సమాచారం అందుకున్న జిల్లా బాలల సంరక్షణ అధికారిణి సీహెచ్ సూర్య చక్రవేణి తన సిబ్బందితో గాలింపు చేపట్టి చివరకు ఆరుగురిని అదుపులోకి తీసుకు న్నారు. వారు రాజస్థాన్‌లోని జోద్‌పూర్‌కు చెందిన వారుగా ఆధార్ కార్డులను బట్టి గుర్తించారు. కొంతమంది మైనర్లు కూడా ఈ ముఠాలో ఉన్నారు. తాము పుస్తకాలు విక్రయించడానికి వచ్చామని ఆ పుస్తకాలు ఎవరు కొనుగోలు చేయకపోవడం పట్ల అవన్నీ లాడ్జిలో పెట్టి జీవనం కోసమే భిక్షాటన చేస్తున్నామంటూ చెప్పుకొచ్చారు. అయితే తదుపరి చర్యలు నిమిత్తం ఏలూరు త్రిటౌన్ పోలీసులకు అప్పగించారు. గత ఏడాది కూడా 70 మంది వరకూ రాజస్థాన్ యువతులు వచ్చి ఊరు శివార్లలో అద్దగించి సొమ్ములు వసూలు చేయడంతో వారందరినీ పోలీసులు రైలు ఎక్కించి పంపించి వేశారు. మళ్లీ వచ్చి పట్టణంలో వసూళ్లకు పాల్పడడంతో పట్టుకుని పోలీసులకు అప్పగించారు.



రాట్నాలమ్మకు సారెను సమర్పిస్తున్న భక్తులు

రాట్నాలమ్మకు ఆషాఢం సారె

పెదవేగి, జూలై 12: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని దంతగుంట్ల గ్రామానికి చెందిన భక్తులు రాట్నాలమ్మకు శుక్రవారం సారె సమర్పించారు. కృష్ణా జిల్లా బాపులపాడు మండలం దంతగుంట్ల గ్రామానికి చెందిన భక్తులు అమ్మవారికి ఏటా ఆషాఢం సారె సమర్పిస్తారని ఆలయ అర్చకుడు సత్యనారాయణశర్మ తెలిపారు. పూలు, పండ్లు, సలివిడి, అరిసెలు, గాజులు, వస్త్రాలు, కొబ్బరికాయలు, మిఠాయిలతో కూడిన సారెను రాట్నాలమ్మవారికి సమర్పించారు.



శాకంబరిగా భువనపల్లి వడలమ్మ

నిడమర్రు, జూలై 12: భువనపల్లి గ్రామ దేవత వడలమ్మకు శుక్రవారం ప్రత్యేక అలంకరణ చేశారు. వివిధ రకాల కూరగాయలు, పండ్లతో శాకంబరిగా అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మ వారిని దర్శించుకున్నారు. ఆషాఢమాసం సందర్భంగా వడలమ్మకు సారె సమర్పిస్తామని, అనంతరం అఖండ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలియజేశారు.

సామూహిక రాహుకాల శ్రీచక్ర కుంకుమార్చన

ఏలూరు కార్పొరేషన్, జూలై 12: అంబికాదేవి ఆలయ ప్రాంగణంలో అర్చకులు వారణాసి రామవేంద్రశర్మ భక్తులతో సామూహికంగా రాహుకాల శ్రీచక్ర కుంకుమార్చన జరిపించారు. తొలుత అమ్మవారికి పంచామృతాభిషేకం చేశారు. విశేష అలంకరణలో అమ్మవారికి పంచ హారతులు ఇచ్చారు. సౌభాగ్యలక్ష్మీదేవి, బావిశెట్టివారిపేట కనకదుర్గాంబ ఆలయంలో మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు.

ఘనంగా మొహరం వేడుకలు

ఏలూరు రూరల్, జూలై 12: స్థానిక గొలుసుల పంజా వద్ద మొహరం వేడుకల్లో భాగంగా హజరత్ మౌలాలి మహాత్ముల ఆస్థానంలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈనెల 17 వరకు మొహరం వేడుకలు నిర్వహించనున్నట్లు పంజా వంశపారంపర్య ముజావరులు ఎమ్మీ వజీర్‌ఆలీ, గాలబ్‌ఆలీ తెలిపారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం పీర్లచావిడి వద్ద పండుగ వాతావరణం నెలకొంది.

ప్లాస్టిక్ కవర్ల వాడకం నిర్మూలిద్దాం



సీఐ రాజేష్‌కు పేపర్ కవర్లు ఇస్తున్న సిబ్బంది

జంగారెడ్డిగూడెం, జూలై 12: పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ కవర్ల వాడకం నిర్మూలిద్దామని సీఐ పి.రాజేష్ అన్నారు. ప్రపంచ పేపర్ బ్యాగ్ దినోత్సవం సందర్భంగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఛైర్మన్ మద్దిపాటి చైతన్య ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులతో కలిసి సీఐ రాజేష్ ప్లాస్టిక్ వాడడం వల్ల అనర్థాలను వివరించారు. పేపర్, క్లాత్, నార, సంచుల వాడాలని వివరించారు. విద్యార్థులు తయారుచేసిన పేపర్ బ్యాగులను పలువురికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల క్యాంపస్ ఇన్‌చార్జి మహేష్, ప్రిన్సిపాల్ నాగమణి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు

ఏలూరు రూరల్, జూలై 12: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉన్నతశిఖరాలు అధిరోహించవచ్చని ఎంపీడీవో బండి ప్రణవి అన్నారు. మాదేపల్లి జడ్పీ హైస్కూల్‌ను శుక్రవారం ఆమె సందర్శించారు. 10వ తరగతి విద్యార్థుల విద్యా స్థాయిని పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు ఖాళీ సమయంలో వాటిని వల్లెవేయాలన్నారు. హెచ్‌ఎం సుంకర వెంకటలక్ష్మి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు, మేరీ ఎలిజబెత్, శివశంకర్, దుర్గ, వెంకటేశ్వరమ్మ, ఉషశ్రీ, అపర్ణ, తదితరులు పాల్గొన్నారు.

దెందులూరు ఉప సర్పంచ్‌గా బర్నాల అప్పారావు ఏకగ్రీవం

దెందులూరు, జూలై 12: దెందులూరు పంచాయతీ ఉప సర్పంచ్‌గా నూపాటి దిబ్బకు చెందిన బర్నాల అప్పారావును ఏకగ్రీవంగా ఎనుకున్నారు. సర్పంచ్ తోట ఏసమ్మ, కార్యదర్శి శ్రీనివాసచౌదరి ఆధ్వర్యంలో శుక్రవారం పంచాయతీ సమావేశం జరిగింది. ఉప సర్పంచ్ పదవి సంవత్సరం కాలం ఒప్పందంలో భాగంగా మురళీకృష్ణ రాజీనామా చేయగా అప్పారావును బోర్డు తీర్మానించింది. ఆయనను గారపాటి కొండయ్యచౌదరి, యిప్పిలి వెంకటేశ్వరావు, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

పోలవరంలో దోమల నివారణకు ఫాగింగ్

పోలవరం జూలై 12: పోలవరంలో దోమల నివారణకు పంచాయతీ అధికారులు శుక్రవారం ఫాగింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈవోపీఆర్‌డి శ్రీనివాసరావు, కార్యదర్శి కొండలరావు స్వయంగా పర్యవేక్షించారు. పాతపోలవరం, ఏనుగుల వారి వీధి, మసీదు వీధి, ముప్పిరిశెట్టివారి వీధి, వడ్డీలపేట ప్రాంతాలలో ఫాగింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది బంగారు కృష్ణ, వారా నాని, పోశి, నరేష్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పెదవేగిలో పారిశుధ్యం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని



జంగారెడ్డిగూడెంలో కందిపప్పు అందజేస్తున్న ఎమ్మెల్యే రోషన్



వినతిపత్రం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



నారాయణపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు

విధుల్లో నిర్లక్ష్యం తగదు

అధికారులతో ఎమ్మెల్యేల సమీక్ష

క్షేత్రస్థాయిలో సమస్యల పరిశీలన

పెదపాడు, జూలై 12: గ్రామాల్లో మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో కల్పించాలని, విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే శాఖాపరంగా చర్యలు ఉంటాయని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అధికారులను హెచ్చరించారు. పెదపాడు మండలం కొక్కిరపాడులో శుక్రవారం అధ్వాన రహదారులను పరిశీలించి అధికారులతో సమీక్షించారు. పరిష్కారం దిశగా చర్యలకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వైసీపీ పాలనలో గ్రామాల్లో రోడ్లన్నీ అధ్వానంగా తయారయ్యాయని, వర్షాకాలం కావడంతో రోడ్లపై వర్షపునీరు నిలిచిపోయి ప్రజలకు అవస్థలకు గురవుతున్నారన్నారు. తక్షణం తగుచర్యలు చేపట్టి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు.

● పెదవేగి: పారిశుధ్యం క్షీణిస్తే వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించి గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ఎంపీడీవో వెంకటరమణకు సూచనలు చేశారు. డ్రెయిన్లను శుభ్రపర్చడం, వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ చల్లించడం, క్లోరినేషన్ చేసిన మంచినీటిని అందించడం చేయాలన్నారు. జూనియర్ అసిస్టెంట్ షేక్ అల్లీ సాహెబ్, సిబ్బంది ఉన్నారు.

పర్యావరణానికి హాని కలిగించొద్దు : ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు: పర్యావరణానికి విఘాతం కలుగకుండా చేపలు, రొయ్యల సాగు చేపట్టాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. కొల్లేరు కాలుష్య నివారణ నివారణపై వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అటవీ, రెవెన్యూ పోలీసు, పంచాయతీరాజ్, కాలుష్య నియంత్రణ, తదితర శాఖల అధికారులతో ఆయన చర్చించారు. కోడి వ్యర్థాల రవాణా అరికట్టాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో టాస్క్‌ఫోర్సు కమిటీలను బలోపేతం చేయాలని డీపీవో తూతిక శ్రీనివాస విశ్వనాథ్‌కు సూచించారు. కొల్లేరులో డ్రెయినేజి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, ఇన్‌లెట్, అవుట్‌లెట్ ఏర్పాటుతో సరైన చర్యలు తీసుకోవాలన్నారు. సాగు, తాగు నీరు కలుషితం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చర్యలు తీసుకునే విషయంలో అధికారులకు అడ్డురామని తెలిపారు. చెర్వులలో కోళ్ల వ్యర్థాలు రవాణా కాకుండా వేరు వేరు ప్రాంతాల నుంచి జరగకుండా చూడాల్సిన బాధ్యత అటవీ, మత్స్య శాఖలు రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు, గణపవరం ఎంపీడీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

అందుబాటులో నిత్యావసర సరుకులు : ఎమ్మెల్యే రోషన్

జంగారెడ్డిగూడెం: ప్రజలకు నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణమండపంలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ సహకారంతో ఏర్పాటుచేసిన కంది పప్పు, బియ్యం విక్రయ కౌంటర్‌ను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. రావూరి కృష్ణ, మండవ లక్ష్మణరావు, మేకా ఈశ్వరయ్య, పెనుమర్తి రామకుమార్, పరిమి సత్తిపండు, కొప్పాక శ్రీనివాసరావు, బొబ్బర రాజ్‌పాల్ కుమార్, తూటిగుంట రాము, రాజాన పండు, తహసీల్దార్ కె.స్లీవజోజి, ఎంపీడీవో కేవీ.ప్రసాద్, సీఎస్‌డీటీ వైవి.లక్ష్మీకుమారి, తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి: పట్టణంలోని జీబీజీ రోడ్డులో సబ్సిడీ కందిపప్పు కౌంటర్‌ను ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ప్రారంభించారు. మార్కెట్ ధరల కంటె తక్కువకు అందించడానికి ప్రభుత్వం ఈ కౌంటర్‌లను రాష్ట్రమంతటా ఏర్పాటు చేసిందని, ప్రజలు వినియోగించుకోవాలన్నారు. పక్కాల వెంకటేశ్వరరావు, చిట్నూరి ధర్మరాజు, నాగ విజయ్‌కుమార్, సింహ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే బాలరాజు

టి.నరసాపురం: నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. తిరుమల దేవిపేట పంచాయతీలోని అబ్బుల్లాపురంలో శుక్రవారం ఆయన పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటర్ ట్యాంక్ రిపేర్, రోడ్లు, ఇంటి స్థలాలు, అబ్బుల్లాపురం - అప్పలరాజుగూడెం ఎర్రకాలువ వంతెన సమస్యలపై గ్రామస్తులు వినతి పత్రాన్ని అందజేశారు. అడపా నాగరాజు, సీహెచ్ నవీన్‌కుమార్, తహసీల్దార్ టి.సుబాష్, ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: గత ప్రభుత్వం మూసివేసిన స్టడీ సెంటర్లను తెరిపించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇప్పించాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు కేవీపీఎస్ నాయకులు వినతపత్రాన్ని అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ ప్రవేటు స్టడీ సెంటర్లలో లక్షలాది రూపాయలు చెల్లించి నిరుపేద నిర్భుగులు కోచింగ్ తీసుకోలేకపోతున్నారని, మూసివేసినవాటిని తెరిపించాలన్నారు.

పాఠశాల సమస్యలపై ఎమ్మెల్యే చంటికి వినతి

ఏలూరు టూటౌన్: శ్రీరామ్‌నగర్ ఎంపీ, యూపీ పాఠశాలను అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే బడేటి చంటికి హెచ్‌ఎం బేతాళ సుదర్శన్ విజ్ఞప్తి చేశారు. బడేటి క్యాంపు కార్యాలయంలో పాఠశాల సిబ్బంది ఎమ్మెల్యేను కలసి వినతిపత్రం సమర్పించారు. పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని, ఆట స్థలం ఏర్పాటు చేయాలన్నారు. సమస్యలు విన్న ఎమ్మెల్యే చంటి మాట్లడుతూ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

బీఎస్ రావుకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న పాఠశాల సిబ్బంది

ఏలూరు రూరల్, జూలై 12: శ్రీచైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ బి.ఎస్ రావు ప్రథమ వర్ధంతి స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం బి.శివకుమారి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల విద్యార్థుల ఘనత ప్రపంచ నలుమూలల వ్యాపింపచేసేలా ఆయన శ్రమించారన్నారు. ఏజీఎం పార్థసారథి, ఉదయభాస్కర్, వెంకటేశ్వరరావు, సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి పాటుపడిన టీడీపీ

ద్వారకాతిరుమల / లింగపాలెం, జూలై 12: ఎన్నికల హామీ మేరకు నాయీ బ్రాహ్మణుల కమ్యూనిటీ హాలు నిర్మాణానికి 50 సెంట్ల స్థలాన్ని కేటాయించిన ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్, సీఎం చంద్రబాబు చిత్రపటాలకు శుక్రవారం పాలాభిషేకం చేశారు. మాజీ జడ్పీటీసీ మొగతడకల శ్రీనివాసరావు, లక్ష్మీరమణి, నాయీబ్రాహ్మణులు పాలాభిషేకం చేశారు. నాయీబ్రాహ్మణ సాధికార కమిటీ అధ్యక్షుడు కొప్పర్ల నాగరాజు కృతజ్ఞతలు తెలియజేశారు.

ద్వారకా తిరుమలలో జ్వరాలు ప్రబలకుండా చర్యలు

ద్వారకాతిరుమల, జూలై 12: ద్వారకా తిరుమలలో బాలికకు డెంగీ సోకినట్లు తెలియడంతో రిపోర్ట్‌లను వైద్యసిబ్బంది పరిశీలించారని జిల్లా వైద్యాధికారి ఎస్.శర్మిష్ట శుక్రవారం తెలిపారు. బాలిక ఏలూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొంది ప్రస్తుతం ఆరోగ్యంగానే ఉందన్నారు. గ్రామంలో నిర్విరామంగా వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. వైద్యసిబ్బంది ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే చేశారన్నారు. జ్వర లక్షణాలున్న వారిని వైద్యశిబిరాలకు తరలించి సరైన వైద్యసేవలు అందిస్తున్నామని వివరించారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తాం

లింగపాలెం, జూలై 12: గ్రామాల్లో ప్రతిఒక్కరికి వైద్య సదుపాయం అందేలా శిబిరాలు ఏర్పాటు చేస్తామని, ఎటువంటి అనారోగ్య సమస్యలు ఉన్నా స్థానిక వైద్యసిబ్బందికి ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలకు తెలియజేయాలని డాక్టర్ కృష్ణకిషోర్ అన్నారు. కె.గోకవరం పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు గ్రామాల్లో ఎవరైనా అనారోగ్యంతో ఉంటే తక్షణం చర్యలు తీసుకోవాలని సూచించారు. పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బంజారా క్రాంతి మాసపత్రిక ఆవిష్కరణ

ఏలూరు రూరల్, జూలై 12: బంజారా భజరంగి భేరి సంఘం ఆధ్వర్యంలో బంజారా క్రాంతి అంతర్జాల మాసపత్రికను రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు శుక్రవారం ఆవిష్కరించారు. అంతరించిపోతున్న బంజారాల సాహిత్యాన్ని, సంస్కృతిని కాపాడడం కోసం బంజారా క్రాంతి పత్రిక తీసుకురావడం గొప్ప కృషి అన్నారు. పత్రిక సంపాదకుడు బుక్యా నాగరాజు నాయక్ మాట్లాడుతూ బంజారా సాహిత్యాన్ని ధర్మాన్ని, జ్ఞానాన్ని భద్రపరిచి రేపటి తరానికి విలువైన సంపదగా ఇవ్వడానికి ఈ పత్రికను ఒక సాధనంగా ఉపయోగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు దరావతు శ్రీనివాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని కళాశాలను మూసివేయాలి

ఏలూరు రూరల్, జూలై 12: నగరంలో అనుమతి లేకుండా నడుపుతున్న విద్యాసంస్థను మూసివేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం డిఈవోను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ నగరంలో కొన్ని విద్యాసంస్థలు ఒక క్యాంపస్ పేరుపై అనుమతి తీసుకుని మిగతా క్యాంపస్‌లో విద్యాసంస్థలు నడుపుతున్నారని, అధ్యాపకులకు విద్యార్హత కూడా సరిగ్గా లేదన్నారు. అధికారులు వీటిపైన స్పందించటం లేదని, వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాకేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సత్వర చికిత్సపై సిబ్బందికి శిక్షణ

ఏలూరు రూరల్, జూలై 12: ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులకు జిల్లా వైద్యఆరోగ్యశాఖ సమావేశ మందిరంలో బాలల సత్వర చికిత్సా కేంద్రం చిన్నపిల్లల వైద్యాధికారి చిర్రా అల్బర్ట్ శుక్రవారం శిక్షణ ఇచ్చారు. అప్పుడే పుట్టిన పిల్లలకు వచ్చే లోపాలు, వైద్యంపై సూచనలు ఇచ్చారు. సత్వర చికిత్స ద్వారా పుట్టుక లోపాలు సవరించవచ్చని, జిల్లా వైద్యా ధికారి ఎస్.సర్మిష్ట అన్నారు. జిల్లాలోని బాలల సత్వర చికిత్స కేంద్రాలు ఏలూరు, జంగారెడ్డిగూడెంలో సేవలందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ అధికారి, నరేంద్రకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోటీల్లో విజేతలకు బహుమతులు

ఏలూరు కార్పొరేషన్, జూలై 12: సత్రంపాడు ఆదిత్య డిగ్రీ కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఏపీ ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ సెట్‌వెల్ ఆధ్వర్యంలో శుక్రవారం బహుమతులు అందజేసినట్లు సెట్‌వెల్ సీఈవో సి.భూషణరావు తెలిపారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వంగా వెంకటేశ్వర రావు, డిఎస్‌డిఏ జి.సుధాకర్, నేషనల్ కెరీర్ సర్వీస్ జిల్లా కోఆర్డినేటర్ జి.ప్రవీణ్‌కృష్ణ, వీపీవీఎస్.సత్యనారాయణ ప్రపంచ జనాభా దినోత్సవం గురించి వివరించారు. సెట్‌వెల్ పర్యవేక్షకులు కేజె.కెనడి, పసుపులేటి ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

పెదపాడు, జూలై 12: కౌలురైతులను ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుంటుందని, అర్హులకు కౌలు కార్డులు అందజేయనున్నట్లు గుత్తా అనిల్ తెలిపారు. పెదపాడులో కౌలురైతులకు కౌలుకార్డులను బొప్పుడి కాశీబాబుతో కలసి శుక్రవారం అందజేశారు. అనిల్ మాట్లాడుతూ అర్హత కలిగిన కౌలు రైతులు స్థానిక వీఆర్వోకు దరఖాస్తు చేసుకుని కౌలు గుర్తింపు కార్డు పొందాలన్నారు. రైతు, కౌలురైతుల సంక్షేమానికి, వారి అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకెళుతుందన్నారు. బొప్పన బాబ్జి, గారపాటి మోహనరావు, కిలారి సాంబశివరావు, పుసులూరి చిన్ని, ముళ్లపూడి పవన్, చేవూరి వెంకట్రావు, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు డైరీలు పంపిణీ

పెదవేగి, జూలై 12: ఉపాధ్యాయులకు యూటీఎఫ్ డైరీలు అందజేసింది. యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భాన్ని పురస్కరించుకుని మండలంలోని ఉపాధ్యాయులకు యూటీఎఫ్ డైరీని ఉచితంగా అందించే ఏర్పాటు చేసింది. డైరీని ఆవిష్కరించిన ఎంఈవో 1 సీహెచ్.బుధవాస్ మాట్లాడుతూ ప్రతి విషయాన్ని డైరీలో పొందుపర్చడం మంచి లక్షణమన్నారు. టి.ఎడ్వర్డ్, పీవీ.రమణ, మరీదు లక్ష్మణరావు, మేకా లక్ష్మీనారాయణ, స్వామి, నరేంద్ర, రెహమాన్, చందక శ్రీను, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్‌కు మీటర్ల ఏర్పాటు వద్దు

ఉంగుటూరు, జూలై 12: రాష్ట్రంలో వ్యవసాయ బోర్లకు మీటర్ల ఏర్పాటు జీవో రద్దు చేయాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య డిమాండ్ చేసారు. కైకరం ప్రజా సంఘాల కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విద్యుత్ రంగంపై శ్వేత పత్రం విడుదల చేసే అంశంలో ట్రూ అప్ చార్జీలు, వ్యవసాయ కనెక్షన్లకు మీటర్లు విషయమై ప్రభుత్వ వైఖరిని స్పష్టంగా ప్రకటించక పోవడం సరి కాదన్నారు. నారా లోకేశ్ యువగళంలో మీటర్లు పగలగొట్టాలని పిలుపు ఇచ్చారని, సోమిరెడ్డి చంద్రశేఖర్ మీటర్లకు వ్యతిరేకంగా హైకోర్టులో దావా వేశారని కృష్ణయ్య గుర్తు చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, గుత్తికొండ వెంకట కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించిన విద్యార్థులు



మోహన సతీష్, ప్రశాంత్, రాకేష్

జంగారెడ్డిగూడెం, జూలై 12: జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించారని హెచ్‌ఎం కె ఎస్‌వి.లోవ కుమారి ప్రకటనలో తెలిపారు. తమ విద్యార్థులు కుందు మోహన సతీష్, చింతపల్లి ప్రశాంత్, గండి రాకేష్ నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. పాఠశాలలో అభినందన సభ ఏర్పాటుచేసి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

భీమడోలు మండలంలో నలుగురి ఎంపిక



జశ్వంత్ వివేక్, ప్రీతివర్ధిని



కీర్తనాదేవి, తేజస్విని

భీమడోలు, జూలై 12 : మండలంలోని గుండుగొలను, పోలసానపల్లి పాఠశాలల నుంచి నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకీ ఎంపికైనట్లు ఎంఈవో భాస్కర్ తెలిపారు. గుండుగొలను జడ్పీ హైస్కూలు నుంచి పి జశ్వంత్‌వివేక్, ఎ ప్రీతివర్ధిని ట్రిపుల్ ఐటీలో ఒంగోలు కళాశాలకు ఎంపికయ్యారు. ఇదే పాఠశాలకు చెందిన పి.కీర్తనాదేవి, పోలసానపల్లి గురుకుల పాఠశాల విద్యార్థిని తేజస్విని శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు తెలిపారు. వారిని ఎంఈవో, ఉపాధ్యాయులు అభినందించారు.

శనివారపుపేట జడ్పీ హైస్కూలు విద్యార్థుల ఎంపిక

ఏలూరు రూరల్, జూలై 12: శనివారపుపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు నలుగురు నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. మురళీ మహేష్, సాయి వెంకటతరుణ్, సాయిచరణ్ షణ్ముక్, బీవీఎస్ అవినేష్ సీట్లు సాధించారని హెచ్‌ఎం ప్రకాష్ తెలిపారు.

నారాయణపురం పాఠశాల నుంచి నలుగురు



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం

ఉంగుటూరు, జూలై 12: నారాయణపపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు నలుగురు ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించారని హెచ్‌ఎం షేక్ మీరా సాహెబ్ తెలిపారు. గోపిశెట్టి రవితేజ, పొన్నాడ పవన్, నక్కా బాల సాయి, పాలపర్తి సూర్య దీపిక ఎంపికయ్యారు. వారిని ఉపాధ్యాయులు అభినందించారు.

కె.కోట పాఠశాల విద్యార్థిని ఎంపిక



కామవరపుకోట, జూలై 12: జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని కొండపాములూరి సాత్విక ఒంగోలు ట్రిపుల్ ఐటీ సీటు ఎంపికైంది. సాత్వికను పాఠశాల హెచ్‌ఎం తాజా గోపాలకృష్ణ, హిందీ టీచర్ నాగరాజు, ఎంఈవోలు డి.సుబ్బారావు, ప్రశాంతకుమార్ అభినందించారు.

గోపవరం హైస్కూల్ విద్యార్థిని..



లింగపాలెం: కె.గోకవరం జడ్పీ పాఠశాల విద్యార్థిని కొట్టే కవిత శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీ సీటు సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం టి.నరసింహారావు తెలిపారు. ఎంఈవోలు రామారావు, రవీంద్ర, ఉపాధ్యాయులు అభినందించారు.

అమరావతిలో మంత్రి అచ్చెన్నాయుడు ఛాంబర్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి పీతల సుజాత, పట్టణ నాయకులు - జంగారెడ్డిగూడెం



అధికారులు రాలేదని.. గ్రామసభ బహిష్కరణ



గ్రామ సభను బహిష్కరించిన రైతులు

కొయ్యలగూడెం, జూలై 12: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు తెలియజేయడంలో అధికారులకు చిత్తశుద్ధి లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని గవరవరంలో పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామ సభకు అధికారులు గైర్హాజరుకావడంతో రైతులు బహిష్కరించారు. రైతులు పశుగ్రాసం పెంచుకోడానికి ఉపాధి హామీ పథకంలో రాయితీలను వివరించడానికి గ్రామసభను ఏర్పాటు చేశారు. పశువైద్యాధికారి శ్రీనివాస్ మాత్రమే హాజరయ్యారు. ఉపాధి హామీ అధికారులు రాకపోవడంతో రైతులు మధ్యాహ్నం వరకు వేచి చూశారు. అధికారులు రాకపోవడంతో గ్రామసభను రైతులు బహిష్కరించారు. మాజీ సర్పంచ్ నరసింహరాజు, గోపాలకృష్ణ, బాబురావు, గూడపాటి శ్రీహర్ష, తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులతో జాగ్రత్త



సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి

ఏలూరు క్రైం, జూలై 12 : విద్యార్థులు అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి నాగ రంజిత్‌కుమార్ అన్నారు. మాదక ద్రవ్యాలు, ర్యాగింగ్ వల్ల దుష్ప్రభావాలపై నరసింహారావు పేట కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రైనీ న్యాయాధికారులు ఎం.రాజరాజేశ్వరి తేజస్విని, పీవీఎస్ఎన్ లక్ష్మీలావణ్య పాల్గొన్నారు. మాదకద్రవ్యాలు ఉపయోగించడం వల్ల ఆరోగ్య సమస్యలే కాకుండా భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. విద్యార్థులు అలాంటి అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. లక్ష్మీలావణ్య మాట్లాడుతూ విద్యార్థులు స్నేహభావంతో మెలగాలని, తోటి విద్యార్థుల మనోభావాలు దెబ్బతినకుండా ఉండేలా ఉండాలని సూచించారు. ర్యాగింగ్ సమస్య ఎదురైనప్పుడు విద్యార్థులు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు కాని తెలియజేయాలన్నారు. సమస్య దాచుకుంటే మానసికంగా కృంగిపోవాల్సి వస్తుందని, దీని ప్రభావం చదువుపై చూపిస్తుందన్నారు. ఒక్కసారి ర్యాగింగ్‌కు పాల్పడిన వ్యక్తిని కళాశాల నుంచి తొలగించడమే కాకుండా చట్ట ప్రకారం కఠినంగా శిక్షిస్తుందన్నారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధతో ఉండాలని సూచించారు.

ప్రజల హృదయాల్లో నిలిచివున్న మాజీ ఎమ్మెల్యే బుజ్జి



బడేటి బుజ్జి విగ్రహం వద్ద ఎమ్మెల్యే, నేతల నివాళి

ఏలూరు టూటౌన్, జూలై 12: ప్రజల హృదయాల్లో మాజీ ఎమ్మెల్యే బడేటి కోటరామారావు (బుజ్జి) శాశ్వత స్థానం సంపాదించుకున్నారని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎన్‌ఆర్.పేటలో బుజ్జి జయంతి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. చంటి మాట్లాడుతూ భౌతికంగా బుజ్జి దూరమైనప్పటికి ఆయన ప్రజలకు చేసిన సేవల రూపంలో జీవించే ఉన్నారన్నారు. బుజ్జి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాటికాపరులకు వస్త్రాలు అందజేశారు. ముందుగా బడేటి క్యాంపు కార్యాలయంలో టీడీపీ కార్యకర్తలు, అభిమానులు భారీ కేక్ కట్ చేశారు. ఐదేళ్లుగా తనను ఆదరించిన కార్యకర్తలకు తగు న్యాయం చేస్తానన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: బడేటి బుజ్జి జయంతి సందర్భంగా కోణంగి పాఠశాలలో కేక్ కట్‌చేసి విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. బుజ్జి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ కంచన రామకృష్ణ, సాంబశివరావు, టి.వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, ప్రసాద్, కె.వెంకటేశ్వరరావు, ఎస్ కె రహీమ్, రమేష్, సాగర్, నాగరాజు, రంగారావు, ఆంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు టూటౌన్ :** సెయింట్ థెరిసా కళాశాలలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు పి.రితేష్, కె.ఆదిత్య, పి.తేజస్వి వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ సిస్టర్ పి.మెర్సి, సిస్టర్ మరియా పాల్గొన్నారు.
- **కామవరపుకోట :** పాతూరులో ఎంపీలు, ఎమ్మెల్యేలు శనివారం ప్రజలతో భేటీ కానున్నారు. సన్నాహాలు పూర్తయ్యాయి. ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని అధికార వర్గాలు తెలిపాయి.
- **చింతలపూడి :** ఏఎంసీ ఛైర్మన్ పదవి జనసేన పార్టీ నాయకుడు చీదరాల మధుబాబుకు ఇవ్వాలంటూ కాపు యువకులు, నాయకులు, ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.
- **లింగపాలెం :** దివ్యాంగుడికి తెలుగుదేశం నేతలు ట్రైసైకిల్ అందజేశారు. మోరంపూడి మల్లికార్జునరావు, తాతిన రాధాకృష్ణ ఆధ్వర్యంలో పబ్బు శ్రీనివాసరావుకు రాధమ్మ ఆర్థిక సహాయంతో ట్రైసైకిల్ అందజేశారు.
- లింగపాలెం మండలం మఠంగూడెంలో తన భూమిని తన సోదరుడు చంద్రశేఖర్ ఆక్రమించాడని నాగమణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై పి.చెన్నారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.
- **పోలవరం :** మండలంలో పంటసాగు హక్కు పత్రాల అవగాహనా కార్యక్రమం ఎల్ఎన్‌డీపేట, వింజరం, ఇటుకలకోట గ్రామాల్లో నిర్వహించారు. డీటీ ప్రసాద్, ఏవో కె రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.
- **కొయ్యలగూడెం :** మండలంలోని సరిపల్లె ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. సర్పంచ్ తాడేపల్లి గోపి, తోట రవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.
- **వేలేరుపాడు :** పశువుల పెంపకంపై తీసుకోవల్సిన జాగ్రత్తలు ఏడీ డాక్టర్ సాయిబుచ్చారావు తెలిపారు. రుద్రమ్మకోట గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామస్థులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.

కూటమి నేతల ఫ్లెక్సీకి పాలాభిషేకం


చాట్రాయిలో నాయకుల చిత్రపటానికి పాలాభిషేకం

చాట్రాయి, జూలై 12: ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు ద్వారకా తిరుమలలో నాయీ బ్రాహ్మణుల కల్యాణ మండపం నిర్మాణం చేపడుతున్నందుకు కూటమి నేతల చిత్రటాలకు నాయీ బ్రాహ్మణ సాధికార కమిటీ మండల శాఖ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. చాట్రాయిలో శుక్రవారం సీఎం చంద్రబాబు, మంత్రి పార్థసారథి, నిర్మాణ దాత ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, స్థల దాత గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. జిల్లా నాయీ బ్రాహ్మణ సాధికార కమిటీ సభ్యుడు రాయవరపు సీతారాములు, మండల నాయకులు రాయవరపు పుల్లారావు, మహేశ్వరరావు, నాగరాజు, చెన్నారావు, హరిబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చాట్రాయి, జూలై 12: మండలంలో తుమ్మగూడెం, సోమవరం సబ్‌స్టేషన్ల పరిధిలో 33 కేవీ కరెంట్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు మండల విద్యుత్ ఏఈ సంజయ్ తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్ఆర్ఐ కాలేజీకి అటానమస్ హోదా

ఆగిరిపల్లి, జూలై 12:ఆగిరిపల్లి సమీపంలో ఉన్న ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలకు, యుజీసీ వారు అటానమస్ హోదా కల్పించినట్టు కళాశాల చైర్మన్ వెంకట్రావు శుక్రవారం తెలిపారు. ఈ హోదా 2024-25 విద్యాసంవత్సరం నుంచి 2033-35 వరకు పదేళ్ల పాటు యాక్టివ్‌గా ఉంటుందన్నారు.

నలుగురు విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ సీట్లు


దీక్షిత సుష్మ కరీమున్నీసా హేమరేవంత్

ముదినేపల్లి, జూలై 12 : 2024-25 విద్యాసంవత్సరానికి నూజివీడు ట్రిపుల్ ఐటీలో ముదినేపల్లి మండలానికి చెందిన నలుగురు విద్యార్థులు ప్రవేశాలు సాధించారు. మండలంలోని వడాలి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి చదివి కైకలూరు నియోజకవర్గ స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన పామిరెడ్డి దీక్షిత, బోడ సుష్మ, ముదినేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు కరీమున్నీసా, హేమ రేవంత్ అనే విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలు పొందారు. వీరిని ఆయా హైస్కూళ్ల హెచ్ఎంలు ప్రభుదాసు, విజయకుమార్, అధ్యాపకులు అభినందించారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

కలిదిండి, జూలై 12 : కలిదిండి పంచాయతీ పరిధి ఇందిరా కాలనీలో మండల పరిషత్ పాఠశాల విద్యార్థు లకు దాత గుండ్రాల అయ్యప్ప ఆర్థిక సాయంతో అందించిన ఉచితంగా నోటు పుస్తకాలను అందించారు. శుక్రవారం టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉచిత పుస్తకాల పంపిణీకి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధుల నివారణ


మలాథియన్ స్ప్రేయింగ్ పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ శివాజీ, వైద్య సిబ్బంది

కైకలూరు జూలై 12 : గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి వ్యాధుల నివారణకు ప్రజలు సహకరించాలని సర్పంచ్ భట్రాజు శివాజీ అన్నారు. శుక్రవారం తామరకొల్లులో దోమల నివారణకు మలాథియన్ మందును వైద్య సిబ్బందితో కలిసి పిచికారీ చేయించారు. వైద్య సిబ్బంది మాట్లాడుతూ నివాస గృహాల వద్ద మురుగునీరు నిల్వ లేకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. డ్రెయినేజీల్లో దోమ పుట్టకుండా ముందస్తుగా మలాథియన్ స్ప్రే చేస్తున్నామన్నారు. సబ్‌యూనిట్ ఆఫీసర్ పీఎస్ఎస్ శ్రీనివాస్, పంచాయతీ సెక్రటరీ ఎం.రవికుమార్, వైద్య సిబ్బంది జి.శ్రీనివాసరావు, తాతారావు, మాధవరాజు, అనిత, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

దత్తాశ్రమంలో యోగా శిక్షణ


యోగాసనాలు వేస్తున్న దృశ్యం

కైకలూరు, జూలై 12: ప్రతీఒక్కరూ రోజూ కొద్దిసేపు యోగా ఆసనాలు వేయడం వల్ల రోజంతా ఉత్సాహంగా జీవించవచ్చని దత్తాశ్రమం ట్రస్టీ అధ్యక్షు డు గురజాడ ఉదయశంకర్ అన్నారు. శుక్రవారం లోకుముడి దత్తాశ్రమంలో యోగా శిక్షణ తరగుతులను నిర్వహించారు. మూడు రోజుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రెండో రోజు మైసూర్‌కు చెదిన దత్తక్రీయ యోగా అంతర్జా తీయ కేంద్రానికి చెందిన గురువులచే శిక్షణ ఇచ్చారు. ట్రస్టీ అధ్యక్షుడు మాట్లాడు తూ మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులలో ప్రాణామాయాలు, ఆసనాలు, ముద్దర్లు, జ్ఞానం, నాడీ శుద్ధి వ్యాఆమాలు నేర్పుతామన్నారు.

ముమ్మరంగా పంట కాల్వల అభివృద్ధి పనులు


కైకలూరు పంట కాల్వలో చెత్త తొలగింపు పనులను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

కైకలూరు, జూలై 12: కైకలూరు పంట కాలువ అభివృద్ధి పనులను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆదేశాల మేరకు ప్రత్యేక కమిటీ పనులను పర్యవేక్షిస్తుంది. కాల్వలకు ఇరువైపులా శుక్రవారం ఎక్స్‌కవేటర్లతో కాల్వల్లోని చెత్త తొలగింపు పనులను నిర్వహిస్తున్నారు. గట్ల వెంబడి ఉన్న చెట్లను కూలీలతో తొలగింపు పనులను చేపట్టారు. మరో రెండు రోజుల్లో కాల్వలకు నీరు విడుదల చేస్తున్నందున ముందస్తుగానే ఎక్కడికక్కడే చెత్త తొలగింపు పనులను కమిటీ యుద్ధప్రాతిపాదికన నిర్వహిస్తుంది. కమిటీ సభ్యులు కొండ్రెడ్డి సత్యనారాయణ, కేవీఎస్ఎం నాయడు, గుర్రం శ్యాంకుమార్, బెల్లాని శ్యామలరావు, ఎండీవో ఉమామహేశ్వరరావు, ఇరిగేషన్ ఏఈ రాజగోపాల్, పంచాయతీ కార్యదర్శి రవికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

గోపవరంలో పారిశుధ్యం అధ్వానం

» బీసీ కాలనీలో మంచినీటి ట్యాంక్ క్లోరినేషన్ ఎప్పుడో? » విషజ్వరాల బారిన స్థానికులు » పట్టించుకోని అధికారులు


నీటి సరఫరా ట్యాంక్


గోపవరం బీసీ కాలనీలో రహదారి దుస్థితి

ముసునూరు, జూలై 12: మండలంలోని గోపవరంలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. బీసీ, ఎస్సీ కాలనీల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. కనీసం మంచినీటి సరఫరా ట్యాంక్‌లు నెలల తరబడి క్లోరినేషన్‌కు నోచుకోక కలుషిత నీరు వస్తున్న పరిస్థితి. అపరిశుభ్రతతో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నప్పటికీ అధికారులు, పాలకులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీసీ కాలనీలో అంతర్గత రహదారులు బురదమయంగా మారడంతో రహదారులపైనే నీరు నిల్వ ఉంటుందని, డ్రెయినేజీల్లో మురుగునీరు నిల్వ ఉండడంతో దోమల ఉధృతి పెరిగి విషజ్వరాల బారిన పడుతున్నామని కానీలవాసులు వాపోతున్నారు. ఈ కాలనీకి నీరు సరఫరా చేసే మంచినీటి ట్యాంక్ శుభ్రం చేసి నెలలు గడుస్తున్నాయని, ఎప్పటికప్పుడు కోరినేషన్ చేసినట్టు తేదీలు మారుస్తూ కాలం వెళ్లదీస్తున్నారని, ట్యాంక్ నుంచి వచ్చేనీరు తాగే పరిస్థితి లేదని, ఒకవేళ తాగితే అనారోగ్య సమస్యలు వస్తున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ కాలనీల్లో సైతం పారిశుధ్యం మరింత అధ్వానంగా మారింది. మురుగునీరు, వర్షపు నీరు పోయేందుకు డ్రెయినేజీలు లేక రహదారులపైనే నీరు ప్రవహించడంతో దుర్వాసన వెదజల్లుతోందని, సీజనల్ జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని ఎస్సీ కాలనీ వాసులు వాపోతున్నారు. పైప్‌లైన్ లీకేజీల వద్ద కలుషిత నీరు వస్తుందని అంటున్నారు. గ్రామంలో నేటికీ దోమల నివారణ మందు పిచికారీ చేయలేదని స్థానికులు చెబుతున్నారు. పారిశుధ్య మెరుగుకు చర్యలు చేపట్టాల్సిన అధికారులు, సర్పంచ్ చోద్యం చూస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ, వైద్యఆరోగ్యశాఖల ఉన్నతాధికారులు పారిశుధ్య మెరుగుకు తక్షణమే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.




అధ్వానంగా ఉన్న డ్రెయినేజీలు

నూజివీడు ఏఎంసీ చైర్మన్ పదవికి తీవ్ర పోటీ

» గతంలో ఈ కమిటీ పదవీ కాలం ఎప్పుడూ మూన్నాళ్ళ ముచ్చటే.. » కూటమి అధికారంలోకి రావడంతో పెరిగిన ఆశావహులు



నూజివీడు, జూలై 12: నియోజకవర్గంలో ఎమ్మెల్యే తర్వాత ప్రాధాన్యత కలిగిన పదవి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి. ఈ పదవి దక్కించుకోవడానికి అధికార తెలుగుదేశం కూటమిలో తీవ్ర పోటీ నెలకొంది. పలువురు తెలుగుదేశం నాయకులతో పాటు ఈ పదవికి స్థానిక జనసేన నాయకులూ ఆశిస్తున్నారు. ఈ పదవి ఇవ్వాలని కోరుతూ ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కొలుసు పార్థసా రథితో పాటు సీఎం చంద్రబాబు, తెలుగుదేశం జాతీయ కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్, వ్యవసాయ శాఖ మంత్రికి పలువురు దరఖాస్తులు ఇస్తున్నారు. ఈ పదవి రేసులో ఆగిరిపల్లి మండలానికి చెందిన ఉమ్మడి కృష్ణా జిల్లా తెలుగు రైతు మాజీ అధ్యక్షుడు చిట్నేని శివరామకృష్ణ, ఈ మండలానికే చెందిన సర్పంచ్ నక్కబోయిన వేణు, తోటపల్లికి చెందిన ఆరేపల్లి శ్రీనివాసరావు, నూజివీడు మండలానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు, నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షుడు జగ్గవరపు వెంకటరెడ్డి, తెలుగుదేశం నాయకుడు అన్నే జయచంద్రశ్రీనివాస్, గోళ్ళ లోకేశ్, చాట్రాయి మండలానికి చెందిన మందపాటి బసవారెడ్డి, మోరంపూడి శ్రీనివాసరావు, ముసునూరు మండలానికి చెందిన కందుల పిచ్చియ్య ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు.

ఎప్పుడూ మూన్నాళ్ల ముచ్చటే

నూజివీడు మార్కెటింగ్ కమిటీ పదవి 2008 నుంచి ఇప్పటివరకు మూన్నాళ్ల ముచ్చటగానే సాగింది. ద్వితీయశ్రేణి నాయకత్వం పెరగడం, ఇష్టంలేని స్థానిక శాసనసభ్యులే దీనికి కారణమని ప్రచారం ఉంది. సార్వత్రిక ఎన్నికలకు మూడునెలల ముందు ఈ పదవిని భర్తీ చేయడం, ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారిన తర్వాత వీరు రాజీనామా చేయడం, ఇప్పటివరకు జరుగుతున్న తంతు. 2004లో రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఎన్నికలకు మూడునెలల ముందు నాటి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తన ముఖ్య అనుచరుడు అయిన పల్లెర్లమూడి అవినాష్‌కు ఇచ్చారు. 2009-2014 కాలంలో చివరి మూడు నెలల్లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో అక్కినేని చిట్టిబాబుకు పదవి దక్కింది. ఇది మూన్నాళ్ళ ముచ్చట అయింది. 2014లో టీడీపీ అధికారంలోకి రావడంతో ఆయన రాజీనామా సమర్పించారు. 2014-2019 తెలుగుదేశం పార్టీ హయాంలోను ఈ పదవి పూర్తిస్థాయిలో భర్తీకాలేదు. చివరి మూడునెలల్లోనే కాపా శ్రీనివాసరావుకు ఈ పదవి దక్కింది. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో మూడు నెలలకే ఆయన తన పదవికి రాజీనామా చేశారు. 2019-2024 మధ్య కాలంలో కూడా చివరి వరకు ఈ పదవి భర్తీ కాలేదు. చివరి రెండు నెలల్లో ముసునూరు మండలం కాట్రేనిపాడుకు చెందిన ఎస్సీ అభ్యర్థి కంబాల కృష్ణవేణికి గత్యంతరం లేని పరిస్థితుల్లో నాటి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఇవ్వాల్సి వచ్చింది. 2024లో తెలుగుదేశం అధికారంలోకి రావడంతో ఇటీవల ఆమె కూడా తన పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో తాజాగా ఈ పదవికోసం పలువురు తెలుగుదేశం నాయకులు ఈ పదవిని ఆశిస్తున్నారు. మంత్రి సారథి గత శాసన సభ్యులు అవలంభించిన విధంగానే కాలం గడుపుతారా? లేక? ముందే ఈ పదవిని ఈ ఐదేళ్ల కాలంలో వంతులవారీగా పంచుతారా? అనేది నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది.

ముసునూరులో బీటీ రోడ్డుకు సహకరించండి


ఎస్ఈ జాన్‌మోసేసుకు పుష్పగుచ్ఛం అందించిన తెలుగు యువత నాయకులు

ముసునూరు, జూలై 12: ముసునూరు తహసీల్దార్ కార్యాలయం నుంచి సిల్క్‌నగర్ మీదుగా ఏలూరు ప్రధాన రహదారి వరకు సూమారు రెండు కిలోమీటర్ల పొడవు ఉన్న అంతర్గత రహదారిని బీటీ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు సహకరించి నిధులు మంజూరు చేయాలని ముసునూరు టీడీపీ నాయకులు కోరారు. శుక్రవారం ఏలూరులోని ఆర్అండ్‌బీ కార్యాలయంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ జాన్ మోసేసును టీడీపీ నాయకులు, సర్పంచ్ తనయుడు కొండేటి ఉదయ్‌కిరణ్, ఉపసర్పంచ్ తోట శ్రీనివాసరావు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, సమస్యలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా సిల్క్‌నగర్ కాలనీకి ప్రధాన రహదారి వర్షం పడితే నడిచే పరిస్థితి లేదని, ఈ రహదారి ఏలూరు రోడ్డుకు అతి దగ్గరదారి కావడంతో పెద్దపెద్ద వాహనాలు తిరుగుతుంటాయని, ఈ రహదారిని బీటీ రోడ్డుగా అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన సానుకులంగా స్పందించి త్వరలోనే రహదారిని పరిశీలించి, ప్రతిపాదనలు రూపొందించేలా చూస్తామని ఎస్ఈ జాన్‌మోసే చెప్పినట్టు నాయకులు తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న ఆర్అండ్‌బీ రహదారుల మరమ్మతులను కూడా త్వరలోనే చేపడతామని ఆయన చెప్పినట్టు నాయకులు తెలిపారు.


పెరికేగూడెం, గురజలో పుస్తకాలు అందజేస్తున్న దృశ్యాలు

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

మండవల్లి జూలై 12 :దానాల్లో విద్యాదానం గొప్పదని, విద్యార్థుల విద్యాభివృద్ధికి వెన్నార్ యాజమాన్యం అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎంఈవో రామారావు సుధానందం పేర్కొన్నారు. పెరికేగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం వెన్నార్ సెరామిక్స్ లిమిటెడ్ ఆర్థిక సహకారంతో రూ. 70వేలు విలువైన వెయ్యి నోట్ పుస్తకాలను వారు పంపిణీ చేశారు. హెచ్ఆర్ ఏజీఎం వి.శ్రీనివాస్, హెచ్ఎం రామకృష్ణ పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రోటరీ క్లబ్ వితరణ

ముదినేపల్లి, జులై 12 :గుడివాడ రోటరీక్లబ్ వితరణతో ముదినేపల్లి మండలం గురజ హైస్కూలు, ఎలిమెంటరీ పాఠశాలల విద్యార్థులకు రూ.75 వేలు విలువైన పుస్తకాలు, ఇతర స్టడీ మెటీరియల్‌ను అందజేసింది. శుక్రవారం హైస్కూల్‌లో హెచ్ఎం జి.కృష్ణమోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాఠశాలలకు చెందిన 450 మంది విద్యార్థులకు క్లబ్ అధ్యక్షుడు టి.ఎస్.రాజశేఖర్, కార్యద ర్శి జి.కిరణ్‌బాబు, టీడీపీ నాయకులు అడుసుమిల్లి రామకృష్ణ, జనార్థన్ ప్రసాద్ పాల్గొన్నారు. హైస్కూలుకు క్లబ్ తరపున రూ.30 వేల విలువైన ప్రింటర్, యూపీఎస్‌లను దాత ఉప్పలపాటి శ్రీధర్ అందజేశారు.

పూర్వ విద్యార్థి స్టడీమెటీరియల్ అందజేత

ముదినేపల్లి మండలం కోమర్రు ఎలిమెంటరీ పాఠశాల పూర్వ విద్యార్థి, పారిశ్రామిక వేత్త సమ్మెట నాగేశ్వరరావు, ప్రవీణ దంపతులు విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. శుక్రవారం ఆ పాఠశాలలో 'బడి రుణం తీర్చుకుందాం' అనే కార్యక్రమం కింద పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పలకలు, ప్యాడ్‌లు ఇతర మెటీరియల్‌ను అందజేశాఆరు. హెచ్ఎం రెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కూనపరెడ్డి సాయి కృష్ణ, మాజీ సర్పంచ్ గంగాధరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

44 మంది ఐటీఐ విద్యార్థుల రక్తదానం


రక్తదానం చేస్తున్న ఐటీఐ విద్యార్థులు

నూజివీడు, జూలై 12:నూజివీడు లయన్స్ క్లబ్, మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో లయన్స్ బ్లడ్‌బ్యాంక్ విజయవాడ వారి సహకారంతో నూజివీడు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం జరిగిన రక్తదాన శిబిరంలో ఐటీఐ విద్యార్థులు 44మంది రక్తదానం చేశారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ కార్యదర్శి సాయి మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్న ప్రతిఒక్కరూ ప్రజల ప్రాణ రక్షణ కోసం రక్తదానం చేయాలని కోరారు. మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురా లు కొంపల్లి అనంతలక్ష్మి మాట్లాడుతూ రక్తదానం సామాజిక బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ నాగభూషణం, ట్రైనింగ్ ఆఫీసర్ శేషగిరి, లయన్స్ అధ్యక్షుడు ఎస్కే రఫీ, రామనొల్ల శ్రీనివాసరావు, మానవతా సంస్థ డైరెక్టర్లు రాజేంద్రబాబు, ఓగిరాల రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

82 మంది యూటీఎఫ్ సభ్యత్వ స్వీకరణ



రమణక్కపేటలో సభ్యత్వం నమోదు చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ముసునూరు, జూలై 12: మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం మొత్తం 82 మంది ఉపాధ్యా యులు యూటీ ఎఫ్ సభ్యత్వం తీసుకున్నారని యూటీఎఫ్ నాయకులు తెలిపారు. శుక్రవారం మండలంలోని పలు పాఠశాలల్లో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు క్యాంపెయిన్‌ను జిల్లా, మండల యూటీఎఫ్ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ రుద్రాక్షి, జిల్లా సహాయ అధ్యక్షుడు జీవీ రావు, జిల్లా కార్యదర్శి బత్తుల అనురాధ, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కాసాని గాంగేయుడు, మండల అధ్యక్షుడు పద్మకిషోర్ తదితరులు రమణక్కపేట, చెక్కపల్లి, గోగులంపాడు, మసునూరు, గోపవరం, కాట్రేనిపాడు, జడ్పీ పాఠశాలల్లో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఎ.పుల్లయ్య, సహ అధ్యక్షులు జి.రాంబాబు, జిసత్యప్రియ, కోశాధికారి ఎన్.నారాయణరావు, జిల్లా కౌన్సిలర్ జి.శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

చిన్నపాటి వర్షానికే చెరువులా రోడ్డు


బొమ్మినంపాడు హైస్కూలు వద్ద ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు

ముదినేపల్లి, జూలై 12 : సింగరాయపాలెం-కోరుకొల్లు ప్రధాన ఆర్అండ్‌బీ రహదారిలో ముదినేపల్లి మండలం బొమ్మినంపాడు గ్రామం వద్ద ప్రమాదకర పరిస్థితి నెలకొంది. చిన్నపాటి వర్షానికే రోడ్డు జలమయమై వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ఈ రోడ్డుపై నడక కూడా నరకయాతనగా ఉంది. శుక్రవారం ఉదయం కురిసిన కొద్దిపాటి వర్షానికే రోడ్డు చెరువులా మారింది. ఈ నీరు రెండు, మూడు రోజుల వరకు తగ్గే అవకాశం లేదు. రోడ్డు గోతులతో నిండి పల్లపు ప్రదేశంగా ఉంది. జిల్లా పరిషత్ హైస్కూల్ పక్కనే ఈ పరిస్థితి నెలకొని ఉండడంతో విద్యార్థులు ప్రమాదాలకు గురవుతున్నారు. సుమారు ఏడాదికాలంగా ఈ పరిస్థితి నెలకొన్నప్పటికీ కనీసం గోతులను పూడ్చేందుకు ఆర్అండ్‌బీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి


ఏలూరులో రైతు సదస్సులో ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న మోరంపూడి

చాట్రాయి, జూలై 12: మామిడి, వరి, పామాయిల్ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్‌కు జిల్లా తెలుగు రైతు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గుత్తా వెంకటేశ్వరరావు, మోరంపూడి శ్రీనివాసరావు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం ఏలూరులో ఏర్పాటు చేసిన రైతు సదస్సులో నాయకులు, రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎంపీ దృష్టికి తెచ్చారు. మామిడికి నల్లనల్లి ఆశించ డంతో పురుగు మందులు కొట్టినా అదుపులోకి రావడం లేదని, కాయ నాణ్యత దెబ్బతిని ధరలు పతనమై నష్టాలు వస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ కొనుగో లు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు చేశాక తేమ శాతం ఎక్కువ ఉందని, ముక్క అవుతుందని చెప్పి ఒక్కో బస్తాకు రూ.150 నుంచి రూ.200 వరకు కోత కోస్తున్నారని, పామాయిల్ ధరలు పడిపోవడం వల్ల గిట్టుబాటు కావడం లేదని ఎంపీకి వివరించారు. రైతుల సమస్యలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు.

చాట్రాయి నుంచి ఏలూరుకు బస్సు నడపాలి


మంత్రికి వినతిపత్రమిస్తున్న నరసింహారావు

చాట్రాయి, జూలై 12: చాట్రాయి మండల ప్రజలు జిల్లా కేంద్రం ఏలూరు వెళ్లేందుకు బస్సు సర్వీసులు నడపాలని పోలవరానికి చెందిన రాష్ట్ర కనీస వేతన సలహా మండలి మాజీ సభ్యుడు చాగంటి నరసింహారావు కోరారు. ఈ మేరకు మంత్రి కొలుసు పార్థసారథికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ చాట్రాయి మండల ప్రజలు ఆసుపత్రులకు, వ్యవసాయ ఉత్పత్తులు అమ్ముకునేందుకు, ఆఫీసు పనుల నిమిత్తం ఏలూరు పట్టణానికి వెళుతుంటారని నేరుగా బస్సులు లేక నిత్యం వ్యయప్రయాసలకు గురవుతున్నారన్నారు. ఏలూరు నుంచి విజయరాయి, వలసపల్లి, చెక్కపల్లి, పోలవరం, చాట్రాయి, చనుబండ మీదుగా సత్తుపల్లికి బస్సులు నడిపితే ప్రజలకు మంచి సౌకర్యంగా ఉంటుందని అన్నారు. దీనిపై స్పందించిన మంత్రి ఏలూరు ఆర్టీసీ ఆర్ఎంకు లేఖ రాశారని ఆయన వివరించారు.

పోలవరంలో వర్షానికి కూలిన చర్చి ప్రహరీ


కూలిన చర్చి ప్రహరీని పరిశీలిస్తున్న స్థానికులు

చాట్రాయి, జూలై 12: పోలవరం గ్రామంలోని సీఎస్ఐ చర్చి ప్రహరీ వర్షానికి కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. గ్రామ పెద్దలు కూలిన గోడను పరిశీలించి వర్షా కాలంలో ప్రజలు పురాతన గోడలు విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు.

రేపు కైకలూరుకు మంత్రులు రాక

కైకలూరు, జూలై 12: కైకలూరుకు ఈనెల 14వ తేదీన ఎంపీ పుట్టా మహేష్ విజయోత్సవ సభలో పాల్గొనేందుకు రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి వస్తున్నారని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఎమ్మెల్యే కామినేని ఆదివారం ఉదయం ట్రావెలర్స్ బంగ్లాలో అందుబాటులో ఉంటారని, పది గంటలకు వింజరం వద్ద లాకుల ద్వారా దిగువకు నీరు విడుదల చేసిన అనంతరం పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆ తరువాత సీఎన్నార్ గార్డెన్ నుంచి మాగంటి థియేటర్ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తారు. ర్యాలీలో మంత్రులు పాల్గొంటారు. ఆ తరువాత సీఎన్నార్ గార్డెన్లో మంత్రులతో, ఎంపీతో సన్మానసభ నిర్వహిస్తారని కార్యాలయ సిబ్బంది తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు ఆర్థిక చేయూత


విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తున్న దాత నాగేశ్వరరావు

ముదినేపల్లి, జూలై 12 : గురజ జిల్లా పరిషత్ హైస్కూ ల్‌లో ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పేద విద్యార్థులు బొర్రా సుహాస్, పుట్టా నాగగిరీష ఇంటర్ చదువు నిమిత్తం దాత యలమంచిలి నాగేశ్వరరావు వితరణ చూపించారు. ఇద్దరు విద్యార్థులకు శుక్రవారం గురజ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన తన తండ్రి వీర రాఘవయ్య జ్ఞాపకార్థం రూ.60 వేలు ఆర్థిక సాయం అదజేశారు. ఇంటర్ రెండేళ్లపాటు ఫీజులను చెల్లిస్తానన్నారు. ఉపాధ్యాయులు, గ్రామస్థులు దాతను అభినందించారు.

దేవస్థానం లైసెన్స్ హక్కులకు వేలం


దేవస్థానంలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

ముదినేపల్లి, జులై 12 :సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లో ఉన్న శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో పలు లైసెన్స్ హక్కులు పొందేందుకు దేవస్థానం అధికారులు శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వి.సుధాకర్ పర్యవేక్షణలో దేవస్థానం ఏసీ ఎస్.సంధ్య నిర్వహించిన వేలంలో ఏడాది కాలపరిమితికి పుట్ట వద్ద కోడిగుడ్లు పోగు చేసుకోవడం, ఇతర పూజా ద్రవ్యాలు అమ్ముకునేందుకు రూ.4.52 లక్షలు, వాహనాల పార్కింగ్ నిర్వహణకు రూ.4.12 లక్షలు ఆదాయం రాగా, కాంప్లెక్స్‌లోని షాపు నిర్వహణకు నెలకు రూ.3200 అద్దెకు తీసుకున్నారు.

కౌలు గుర్తింపు కార్డులు తీసుకోవాలి


చాట్రాయిలో కౌలురైతు కార్డులు అందజేస్తున్న తహసీల్దార్


వేమవరప్పాడులో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ ఏడీ గంగాధరరావు

కైకలూరు జూలై 12 : ప్రతీ కౌలుదారుడు గుర్తింపు కార్డులు తీసుకోవాలని, అప్పుడే ప్రకృతి వైపరీత్యాల వల్ల వచ్చే నష్టపరిహారాలు నేరుగా కౌలుదారునికే అందుతాయని వ్యవసాయ శాఖ ఏడీ ఆర్.గంగాధరరావు అన్నారు. శుక్రవారం వేమవరప్పాడులో కౌలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతీ కౌలుదారుడు భూయజమాని అంగీకారంతో కౌలు గుర్తింపుకార్డు తీసుకోవాలని ఈ కార్డు వల్ల కౌలు రైతుకు వ్యవసాయ శాఖ ద్వారా అమలయ్యే పలు పథకాలు ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటనష్టం జరిగిన రుణాలు తీసుకునేందుకు కౌలు గుర్తింపుకార్డు దోహదపడుతుందన్నారు. ఈ కౌలు గుర్తింపు కార్డు తీసుకోవడం వల్ల భూయజమానికి ఎలాంటి నష్టం వాటిల్లదన్నారు. ఈ కార్డు పదకొండు నెలల కాలపరిమితికి మాత్రమే ఉపయోగపడుతుందన్నారు. కౌలు రైతు ఆధారుకార్డు జిరాక్సు, పాస్‌పోర్ట్ ఫొటో, భూయజమాని పొలం పాస్‌బుక్ జిరాక్సు కాపీలను వీఆర్వో, వీపీఏలకు అందజేయాలన్నారు. ఏవో ఆర్.దివ్య, రైతులు పాల్గొన్నారు.

• చాట్రాయి. : కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొంది ప్రభుత్వ సదుపాయాలను వినియోగించుకోవాలని తహసీల్దార్ మహ్మద్ మక్సూద్ అలీ, వ్యవసాయ అధికారి శివశంకర్ కోరారు. చాట్రాయి రైతుసేవా కేంద్రంలో శుక్రవారం రైతులు కౌలురైతుల అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పలువురు కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేశారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, జనసేన నాయకుడు తుమ్మల జగన్, వీఆర్వో సాంబ మురుగన్, హెచ్ఏ రాజేశ్వరి రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

• ముసునూరు : ఖరీఫ్ సీజన్‌లో కౌలు వ్యవసాయం చేసే రైతులు కౌలు గుర్తింపు కార్డులను పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని వీఆర్వో మస్తాన్‌రావు అన్నారు. శుక్రవారం ముసునూరు ఆర్బీకేలో కౌలు గుర్తింపుకార్డులపై రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ కౌలు చేసే భూమి యాజమానికి పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ నకళ్ళు, ఫోన్ నెంబరు, కౌలు రైతుకి చెందిన ఆధార్, రెండు ఫొటోలు, ఫోన్‌నంబర్లను దరఖాస్తుకు జతచేసి ఆయా గ్రామాల వీఆర్వోలు, వీపీఏలకు అందజేయాలని కోరారు. నియోజకవర్గ తెలుగు యువత కార్యాదర్శి కొండేటి బాబి, ఉప సర్పంచ్ టి.శ్రీను, పంచాయతీ కార్యాదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు, వీహెచ్ఏ ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

• నూజివీడు :నూజివీడు మండలం గొల్లపల్లి, పల్లెర్లమూడి, ఎంఎన్‌పాలెం, మీర్జాపురం, పోతురెడ్డిపల్లి గ్రామాల్లో రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు ఆధ్వర్యంలో పంట సాగు హక్కు పత్రం జారీపై గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం జరిగింది. మండల వ్యవసాయ అధికారి ఎ.చాముండేశ్వరి మాట్లాడుతూ కౌలురైతు కార్డులను, కౌలుపొలం చేసే ప్రతిరైతు దరఖాస్తు చేసుకుని తీసుకోవాలన్నారు. పంట సాగు హక్కు పత్రం 11నెలలకు మాత్రమే పరిమితి ఇవ్వబడుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వీపీఏ, వీహెచ్ఏ, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.